
## లక్ష బొద్దింకలు సీజ్



9

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 7 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 152 | పేజీలు:12 | వెల రూ.5

## అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



# ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్

## 2034 వరకూ ప్రజా ప్రభుత్వమే

## మీది విధ్వంసం.. మాది వికాసం

- రోజుకు 18 గంటలు పని చేస్తున్న
- కారు చెడిపోయి కార్ఖానాలో ఉంది
- ధాన్యాన్ని కొనలేని మోడీ గద్దె దిగాలె
- కొహెడలో సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, (మనం బ్యూరో)** : కొహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్‌తో రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వస్తుందని సీఎం ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా కొహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కాంప్లెక్స్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో రంగారెడ్డి జిల్లా రైతులు హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు అందించేవారనీ, ఇప్పుడు రియల్ ఎస్టేట్ పెరిగి వ్యవసాయం కుంటుపడిందని పేర్కొన్నారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కొహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారనీ, నాటి ఎంపీగా ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని హామీ ఇచ్చానని గుర్తు చేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులున్నాయనీ, అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఎవరెంత ఏడ్చినా ...మిగతా 2లో



### ఏఐ అన్నీ క్రియేట్ చేయొచ్చు...

## రాజకీయ నాయకుల్ని సృష్టించలేదు

గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న ప్రధాని మోడీ

చెరువులు, నాలాలు, జల వనరుల రక్షణకే హైడ్రా ఏర్పాటు

త్వరలోనే 5 వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

'ది హిందూ హడిల్ 2026.. ఇండియా ఇన్ డైలాగ్' సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి

### జేఈఈలో అర్హత మార్కులు లేకున్నా

## కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు

**వెబ్ ఆప్షన్లకు కూడా అనుమతిచ్చిన ఐఐటీ రూర్కీ**



**డెహ్రాడూన్, జూన్ 6** : జేఈఈ పరీక్షలో ర్యాంకు సాధించి ఇంజినీరింగ్ యూజీ కోర్సుల్లో ప్రవేశానికి కావాల్సిన కనీస అర్హత మార్కులు పొందని విద్యార్థులు కూడా కౌన్సిలింగ్లో పాల్గొనవచ్చని ఐఐటీ రూర్కీ ప్రకటించింది. ...మిగతా 2లో

### అన్నామలైకి అనూహ్య

## స్పందన

**ఒక్క రోజులోనే 14 లక్షల మంది చేరిక**



**చెన్నై, జూన్ 6** : బీజేపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన కొత్త రాజకీయ కార్యాచరణను ప్రకటించిన తమిళనాడు నేత, మాజీ ఐపీఎస్ అన్నామలైకి ప్రజల నుంచి ఊహించని మద్దతు వస్తోంది. 'వియ్ ది పీపుల్' పేరిట ఆయన ప్రారంభించిన రాజకీయ ఉద్యమానికి ...మిగతా 2లో

## విద్యాశాఖలో డిప్యూటీ ఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ 2

12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్

### సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ

## అత్యంత అనుకూలం

- ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మీ దేశ కంపెనీలను ప్రోత్సహించండి
- భవిష్యత్తు అవసరాలకు తగ్గ 'ఎకో సిస్టం' అభివృద్ధి చేస్తున్నం
- మలేషియా ప్రతినిధి బృందంతో మంత్రి శ్రీధర్ బాబు భేటీ

**హైదరాబాద్, జూన్ 6** : సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా - పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'తెలంగాణ-మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్ మెంట్ తదితర



రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార ...మిగతా 2లో

## వాన జల్లు.. రాష్ట్రం చిల్ 2

- ఉక్కపోత నుంచి ఉపశమనం
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం
- నేడు ఐదు జిల్లాలకు భారీ వర్ష సూచన
- రాష్ట్రంలోకి విస్తరిస్తున్న నైరుతి రుతుపవనాలు

## మహిళల కోసం 'స్త్రీ రైడ్'



- డీజీపీ చేతుల మీదుగా ప్రారంభం
- 'మోవో ఫ్లీట్ యాప్'తో సురక్షిత ప్రయాణం
- అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో లేడీ రైడర్స్

**హైదరాబాద్,జూన్ 6(మనం,ప్రత్యేక ప్రతినిధి)** : మహిళల భద్రత, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ విభాగానికి చెందిన 'విమెన్ సేఫ్టీ వింగ్' ఒక సరికొత్త వినూత్న ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చింది. 'స్త్రీ రైడ్' పేరుతో రూపొందించిన ...మిగతా 2లో

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు 3

## సనత్‌నగర్ టిమ్స్ రెడీ.. 2

సీఎం చేతుల మీదుగా ప్రారంభం

## 'చేప ప్రసాదం' పంపిణీకి సర్వం సిద్ధం

**రేపు రాత్రి 9 గంటల నుంచి పంపిణీ**



ప్రజల కోసం ఫ్యాన్లు, కూలర్లు, మెడికల్ క్యాంపుల ఏర్పాటు

సీపీఆర్ బృందాలు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు సిద్ధం

షీ టీమ్స్ నిఘా.. కంట్రోల్ రూమ్‌తో నిరంతర పర్యవేక్షణ 3

## పోచంపల్లి ఇక్కత్ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

- చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం బాసట
- 'ట్రెడ్ పోచంపల్లి' ప్రదర్శన సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3

### పనిపై సమగ్ర అవగాహన కోసమే

## సైట్ విజిట్ నిబంధన

మెడికల్ బోర్డులపై కొనసాగుతున్న ఏసీబీ విచారణ

కారుణ్య నియామకాల అక్రమాల కేసులో ఇద్దరి అరెస్టు

సింగరేణి యాజమాన్యం ప్రకటన

**హైదరాబాద్, జూన్ 6** : 137 ఏళ్లుగా మైనింగ్ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ దశాబ్దాలుగా దక్షిణాదిలో పలు రాష్ట్రాలకు నిరాటంకంగా బొగ్గు రవాణా చేస్తోంది. 39 గనులున్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్ గా ఉండటం అత్యంత సహజం. ఈ ఏడాది కూడా ...మిగతా 9లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలె

- విద్యావ్యవస్థను సంస్కరించాలె
- కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్
- ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన
- పాల్గొన్న ఆ పార్టీ ఫౌండర్ అభిజీత్ దీప్కే, విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్ చుక్
- ఇది ఆరంభమేనంటూ నిరసించిన విద్యార్థులు



**ఢిల్లీ, జూన్ 6** : ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్ చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది.



సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. ...మిగతా 2లో

### నీళ్లు దొర్కక

## 49 మంది మృతి

సహారా ఎడారిలో ఘటన

**ఢిల్లీ, జులై 6** : పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొర్కక దాహంతో 49 మంది ప్రాణాలు ...మిగతా 2లో



మనం Manam



## సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ
# అత్యంత అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్కు ఉన్న అనుభవం... గ్లోబల్ సెమీకండక్టర్ హబ్గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం'అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

# సనత్‌నగర్ టిమ్స్ రెడీ..

- సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- గుండె జబ్బులు, అవయవ మార్పిడికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా టిమ్స్
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం
- టిమ్స్‌లో ఏర్పాట్లపై మంత్రి దామోదరా సమీక్ష

**హైదరాబాద్,జూన్ 6(మనం న్యూస్):** హైదరాబాద్ సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అత్యాధునిక టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ ఆసుపత్రిని సందర్శించి, ప్రారంభోత్సవ ఏర్పాట్లు , హాస్పిటల్ సంసిద్ధతపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఉచితంగా అందించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగానే ఈ సరికొత్త వైద్య సంస్థను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలన:**

హాస్పిటల్‌లోని ఎ,బి,సీ బ్లాకులను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా సందర్శించారు. అందులో భాగంగా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అలాగే సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్రే, అల్ట్రాసౌండ్ తదితర ఆధునిక రేడియాలజీ యంత్రాల పనితీరును, డయాగ్నస్టిక్స్ ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్ , ఫార్మసీ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, సేవల నిర్వహణ వ్యవస్థలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలి:**

ఆసుపత్రి అధికారికంగా ప్రారంభం కావడానికి ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ , సాంకేతిక పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యం, సెక్యూరిటీ , ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని సూచించారు. రోగుల రద్దీని తట్టుకునేలా ఓపీ కౌంటర్లు, హెల్ప్ డెస్క్‌లు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు ఆధునిక వైద్య యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందించేలా, వాటిని నిర్వహించడానికి అవసరమైన స్పెషలిస్ట్ డాక్టర్లు, టెక్నీషియన్లు , ఇతర సహాయక సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్':**

సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధుల (కార్డియాలజీ) చికిత్సలకు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఒక ప్రముఖ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేక క్యాథ్‌లాబ్‌లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు , అవయవ మార్పిడి సదుపాయాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ సంస్థగా టిమ్స్ నిలవాలన్నారు. కేవలం రోగులకే కాకుండా, వారితో పాటు వచ్చే సహాయకుల కోసం ధర్మశాల (వసతి గృహం), నాణ్యమైన క్యాంటీన్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు , హాస్టల్ బ్లాకులను కూడా సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు.

# అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య

**ఫిలడెల్ఫియా, జూన్ 6 :** అమెరికాలోని నార్త్ ఫిలడెల్ఫియాలో దారుణం చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన కుంచ అంశుల్ హత్యకు గురయ్యాడు. ఆన్లైన్ ఫుడ్ డెలివరీ చేస్తున్న సమయంలో కొందరు దుండగులు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని స్వదేశానికి త్వరగా తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


ఫిలడెల్ఫియా పోలీసుల వివరాల ప్రకారం.. ఎడ్లే స్ట్రీట్ లోని రేమండ్ రోసెస్ హౌసింగ్ కాంపెక్స్ లో అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో (అక్కడి కాలమాన ప్రకారం) ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకోగా.. అంశుల్ స్పృహ కోల్పోయి పడి ఉండటాన్ని గమనించారు. అతడి తలకు బుల్లెట్ గాయమైనట్లు గుర్తించారు.

వెంటనే సమీపంలోని టెంపుల్ యూనివర్సిటీ ఆసుపత్రికి తరలించగా.. కొద్దిసేపటికే అంశుల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. అయితే, ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. దుండగులు అతి సమీపం నుంచే కాల్పులు జరిపినట్లు తెలుస్తోందన్నారు.

# మహిళల కోసం 'స్త్రీ రైడ్'

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ డీజీపీ కార్యాలయంలో శనివారం అధికారికంగా ప్రారంభించారు. ర్యాపిడో తరహాలోనే మహిళల కోసం మహిళా డ్రైవర్లనే అందుబాటులోకి తెస్తూ 'మోవో ఫ్లీట్ యాప్' ద్వారా ఈ సేవలను ప్రారంభించారు. దీనివల్ల ఇకపై యువతులు, మహిళలు ఎలాంటి భయం లేకుండా నిర్భయంగా ప్రయాణించనున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ.. లైసెన్సుల పంపిణీమహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడంతో పాటు, సదరు మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేలా (స్వయం ఆధారిత జీవనం) ఈ సురక్షిత రవాణా సౌకర్యాన్ని ప్రవేశపెట్టారు.



**తొలివిడత 55 మంది :**

'స్త్రీ రైడ్'లో తొలి విడతలో 55 మంది మహిళలను 'స్త్రీ రైడర్లు'గా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ 55 మందికి అంబర్‌పేట్ పోలీస్‌లైన్స్‌లో విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో టూ వీలర్, త్రీ వీలర్ , ఫోర్ వీలర్ వాహనాలను నడపడంలో ప్రత్యేక డ్రైవింగ్ నైపుణ్యాల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా రైడర్లకు ఉమెన్స్ సేఫ్టీ వింగ్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులను సైతం అందజేశారు. మహిళలు లేదా యువతులు ప్రైవేట్ రైడింగ్ యాప్స్ ద్వారా బైక్ లేదా కార్లను బుక్ చేసుకున్నప్పుడు, పురుష డ్రైవర్ల వల్ల కొన్నిసార్లు అసౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగానే 'స్త్రీ రైడ్' ప్రాజెక్ట్ పుట్టుకొచ్చింది. ఇకపై మహిళలు తమ ప్రయాణాల కోసం 'మోవో ఫ్లీట్ యాప్' డౌన్‌లోడ్ చేసుకుని రైడ్ బుక్ చేసుకుంటే, మహిళా డ్రైవర్‌లు వచ్చి వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తారు.

**అందుబాటులో :**

పురుషులకు ఏమాత్రం తీసిపోకుండా మేము సైతం టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను నడుపుతామని శిక్షణ పొందిన మహిళా రైడర్లు వివరించారు. మహిళలపై జరిగే వేధింపులను అరికట్టేందుకు, సెల్ఫ్ డిఫెన్స్ (ఆత్మరక్షణ) విషయంలో కూడా విమెన్ సేఫ్టీ వింగ్ మాకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిందన్నారు. కేవలం రవాణా కోసమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో చిక్కుకున్న మహిళలకు తక్షణ సేవలు అందించడానికి కూడా స్త్రీ రైడర్లుగా నిత్యం అందుబాటులో ఉంటాం అని ధీమా వ్యక్తం చేశారు. మహిళా ప్రయాణికులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, సరికొత్త ఉపాధి మార్గాన్ని చూపిన ప్రభుత్వానికి, పోలీసు శాఖకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం డీజీ చారు సిన్హా, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి, లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, డీజీ ఆర్గనైజేషన్స్ స్వాతి లక్రా, మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఐజీ రోడ్ సేఫ్టీ రమేష్ నాయుడు తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు

# ఔర్ ఏక్ బార్ కాంగ్రెస్ సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

ఆఆర్ఆర్ ఆగదు...అభివృద్ధి కూడా ఆగదు...వ్యవసాయం దండగ కాదు, పండుగ అని నిరూపిస్తున్నామన్నారు. కాళేశ్వరం కూలేశ్వరం అయినా, దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నామని, వరి వేస్తే ఉరే అని చెప్పిన రోజులు కావనీ, వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. కారు పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉందనీ, ఎన్ని మరమ్మత్తులు చేసినా చెడిపోయిన ఆ కారు పనికి రాదన్నారు. కేసీఆర్ కుర్చీ వేసుకుని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పాడు.

కానీ, గెలిచిన తరువాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకు రావాలని ప్రయత్నిస్తున్నామని సీఎం వెల్లడించారు. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారనీ, ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీతోనైనా, డిల్లీలో ఉన్న మోడీతోనైనా కొట్లాడతానని స్పష్టం చేశారు. నేను పదవి నుంచి దిగిపోవాలని కిషన్ రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు, తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోడీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేసి మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తానని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తేస్తానని, మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తానని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## ఏఐ అన్నీ క్రియేట్ చేయొచ్చు...
# రాజకీయ నాయకుల్ని సృష్టించలేదు

**హైదరాబాద్, జూన్ 06 ( మనం బ్యూరో ) :** ఏఐ అన్నీ క్రియేట్ చేయొచ్చు కానీ, రాజకీయ నాయకుల్ని సృష్టించదు. నాకు ఏఐ భయం లేదు, మన యువత ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టాలి, స్కిల్స్ పెంచుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో చెరువుల ఆక్రమణలు తొలగించి పునరుద్ధరణ చేపడుతున్నామనీ, నాలాలను పేదలు ఆక్రమించుకుంటే అర్థం చేసుకోగలం కానీ, పెద్దవాళ్లు జలవనరులను చెరపడుతున్నారనీ, అందుకే సీనియర్ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో హైడ్రాను ఏర్పాటు చేశామనీ, ఇప్పుడు మా దగ్గర ఎవరికీ జల వనరులను ఆక్రమించే ధైర్యం చేస్తున్నారేమో అడగండి వ్యాఖ్యానించారు. మా రాష్ట్రంలో ఓడ రేవు లేదనీ, అందుకే ప్రధాని మోడీ ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చించి మచిలీపట్నం ఓడరేవును అనుసంధానించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. గుజరాత్ పెట్టుబడులను ఆకర్షించడం లేదనీ, గత 20 ఏళ్ల నుంచి ఒకే ఒక్క బ్రాండ్ అంబాసిడర్ అక్కడ పని చేస్తున్నారని ప్రధాన మంత్రి మోడీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

శనివారం బెంగళూరులో ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ది హిందూ నిర్వహించిన 'ది హిందూ హడిల్ 2026, ఇండియా ఇన్ డైలాగ్' సదస్సులో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా తన రాజకీయ ప్రస్థానంపై ఆ పత్రిక గ్రూప్ డైరెక్టర్ ఎన్. రామ్ అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిస్తూ విద్యార్థిగా విద్యార్థి పరిషత్‌లో ఆ తరువాత వ్యాపారం, ఇండిపెంటెండ్ జడ్పీటీసీగా గెలిచి చంద్రబాబు నాయుడుతో పదేళ్లు పని చేశానని చెప్పారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర విభజన, స్థానిక కారణాలతో టీడీపీకి రాజీనామా చేశానన్నారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా బలమైన పోరాటం కావాలని ప్రజలు భావించారనీ, ఆ సమయంలో తన ఎదుట ఎన్నో మార్గాలున్నప్పటికీ 60 ఏళ్ల తెలంగాణ ప్రజల కలను సోనియా గాంధీ నెరవేర్చినందున కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. వచ్చే జూలైతో నా ప్రజా జీవితం 20 ఏళ్లు పూర్తవుతుంది. నా రాజకీయ జీవితమంతా ప్రజలు సామాన్యుల కోసం పోరాడా. నాకు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేదు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి వచ్చానని స్పష్టం చేశారు. గతంలో రాష్ట్రాన్ని పాలించే అవకాశం వచ్చిన వారు పాలకులుగా భావించారనీ, కానీ తాను మాత్రం సేవ చేయడానికి వచ్చిన ప్రజా ప్రతినిధిగా భావించానని స్పష్టం చేశారు.

తెలంగాణలో ప్రభుత్వ రంగంలో 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేసీఆర్ ఆ సమస్యను పరిష్కరించలేదనీ, గత 15 నెలల వ్యవధిలోనే 67,650 ఉద్యోగాలు ఇచ్చామనీ, త్వరలోనే 5 వేల పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వబోతున్నామనీ, మా యువత ఇప్పుడు ఉద్యోగాలకు సిద్ధమవుతున్నారని వెల్లడించారు. గతంలో మహారాష్ట్ర తరువాత తెలంగాణలోనే ఎక్కువ సంఖ్యలో రైతుల ఆత్మహత్యలు జరిగేవనీ, తాను అధికారంలోకి వచ్చాక 25035 రైతు కుటుంబాలకు చెందిన రూ.20616 కోట్ల రుణాలను మాఫీ చేశాననీ, ఇది దేశంలోనే అత్యధిక రుణమాఫీ అని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రం తెలంగాణ అని ఎన్‌సీఆర్‌బీ నివేదిక పేర్కొందన్నారు.

పంట సేకరణను కేంద్రం పట్టించుకోవడం లేదనీ, ఎమ్మార్పీ ప్రకటించి చేతులు దులుపుకుంటోందనీ, పంట ఉత్పత్తుల సేకరణను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మహిళా సాధికారత అంశంపై మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్ఎస్‌జీ గ్రూపుల్లో 67 లక్షల మంది మహిళలు 0 వడ్డీతో రూ.60 వేల కోట్ల రుణాలను తీసుకున్నారనీ, ఆ వడ్డీలను మేం కడుతున్నామని తెలిపారు. మహిళా సంఘాలకు 1000 బస్సులు కొనుగోలు చేసి ఇచ్చామనీ, వాళ్లకు పెట్రోల్ బంక్‌లు, సోలార్ ప్లాంట్లు ఇచ్చామనీ, ప్రతి ప్రభుత్వ సంస్థ వద్ద మా మహిళా సంఘాల సభ్యులు క్యాంటీన్లు నడుపుతున్నారని వెల్లడించారు. తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా లక్ష్యంగా పెట్టుకున్నారు...అదెలా సాధ్యం అని అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి మా వద్ద సమగ్ర ప్రణాళిక ఉందనీ, అందులో భాగంగా రాష్ట్రం మొత్తాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అంటూ మూడు విభాగాలుగా విభజించామనీ, దీనికి సంబంధించి గతేడాది డిసెంబర్‌లో గ్లోబల్ సదస్సు నిర్వహించామనీ, పాలసీ డాక్యుమెంట్ కూడా విడుదల చేశామనీ, పాలసీకి తగినట్లు ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# వాన జల్లుతో రాష్ట్రం చిల్లు


**హైదరాబాద్, మనం ప్రతినిధి :** గత కొద్దిరోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న తెలంగాణ ప్రజలకు... తొలకరి వర్షంతో ఉపశమనం లభించింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఇదిలాఉంటే, గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిల్మ్ నగర్, బోరబండ, యూసుస్‌గూడ, ఎస్ఆర్ నగర్, సనత్ నగర్, ఉప్పల్, ఎల్‌బీనగర్, వనస్థలిపురం, హయత్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. దీంతో ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట లభించింది. ఇక పొరుగున ఉన్న రంగారెడ్డి జిల్లాలోని కొహెడ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. తెలంగాణవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అనుకూలిస్తోంది. ఈ క్రమంలో నేడు.. జూన్ (7న)రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం హెచ్చరిక జారీ చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఐఎండీ వెల్లడించిన తాజా బులెటిన్ ప్రకారం.. నల్గొండ, సూర్యాపేట, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

అలాగే, రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో రానున్న 24 గంటలపాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షపు జల్లులు పడే వీలుందని అంచనా వేశారు. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్ గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

**వర్షాల హెచ్చరిక.. సీఎస్ కీలక ఆదేశాలు**

తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

# తెలంగాణ మా జాగీరే



- పవన్...ఆ భూమిని వెనక్కి ఇవ్వు
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,జూన 6(మనం,ప్రత్యేక ప్రతినిధి) :** హైదరాబాద్‌లోని 'కోటిచెరువు' శిఖం భూమిని పవన్ కల్యాణ్ కబ్జా చేశారంటూ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. జూబ్లీహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పవన్ గనుక ఆ భూమిని ఆక్రమించలేదని చెబితే, వెంటనే ఆ స్థలాన్ని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించి, అక్కడి నిర్మాణాలను, మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ఆ 10 ఎకరాల భూమి పూర్తిగా 'శిఖం' (ప్రభుత్వ) భూమి అని కవిత స్పష్టం చేశారు. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం 3 ఎకరాలను మాత్రమే శిఖం భూమిగా చూపి, మిగిలిన 7 ఎకరాలను 'మాగాణి' (ప్రైవేట్) భూమిగా మార్చేశారని.. ఇది స్పష్టమైన నిబంధనల ఉల్లంఘనే అని ఆమె ఎండగట్టారు.ఇటీవల పవన్ చేసిన 'తెలంగాణ మీ అబ్బ సొత్తా.. మీ అయ్య జాగీరా?' అనే వ్యాఖ్యలపై కవిత అత్యంత ఘాటుగా స్పందించారు.

**అవును...మా జాగీరే :**

తెలంగాణ కచ్చితంగా మా జాగీరే, 1,200 మంది అమరవీరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ అని కవిత తేల్చిచెప్పారు. ఇది తెలంగాణ ప్రజల సొత్తు, ఎవరి ముత్తాతలదో కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజధానిని కూడా నిర్మించలేకపోయిన పవన్.. ఇప్పుడు తెలంగాణలో కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి సరైన స్థానిక నాయకులు లేకపోవడం వల్లే పవన్ను వాడుకుంటున్నారని విమర్శించారు.ప్రజా గాయకుడు గద్దర్‌కు తాను కారు కొనిచ్చి సాయం చేశానన్న పవన్ వ్యాఖ్యలను కూడా కవిత తప్పుబట్టారు. నైజాం ఏరియా నుంచి తన సినిమాల ద్వారా కోట్లాది రూపాయల రెవెన్యూ సంపాదిస్తున్న పవన్.. ఇక్కడి జానపద కళాకారులను గానీ, చిన్న నిర్మాణాత్మక శక్తులను గానీ ఎప్పుడైనా ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. పైగా జానపద కళాకారుల ట్యూన్లను వాడుకుంటూ వారికి కనీస గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు.

## జేఈఈలో అర్హత మార్కులు లేకున్నా
# కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చు

(మొదటి పేజీ తరువాయి)

వెబ్ ఆప్షన్లు నమోదుచేసుకోవచ్చని తెలిపింది. సదరు విద్యార్థులు జులై 15 లోపు తమ రివైజ్డ్ స్కోర్ కార్డును సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. ఆ స్కోర్ కార్డును orgjeeiitr.ac.in ఈమెయిల్కు పంపాలని సూచించింది. రివైజ్డ్ స్కోర్కార్డు అందిన తర్వాత విద్యార్థుల వెబ్ ఆప్షన్ల ఆధారంగా 4వ రౌండ్లో సీట్లు కేటాయిస్తామని పేర్కొంది.

దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఎన్ఐటీలు, యూనివర్సిటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు జనరల్/ఓబీసీ-ఎన్సీఎల్/జనరల్-ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులు 75 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ కేటగిరీ విద్యార్థులకు 65 శాతం మార్కులు అర్హతగా ఉంది. అయితే ఆయా కేటగిరీ విద్యార్థులు అంతకన్నా తక్కువగా ఉన్న ప్రస్తుతానికి కౌన్సిలింగ్కు అనుమతిస్తామని ఐఐటీ రూర్కీ వెల్లడించింది. అయితే రివాల్యూయేషన్ అనంతరం విద్యార్థులు తమ స్కోర్కార్డులను సమర్పించాలని సూచించింది.

గతనెల 13న సీబీఎస్ఈ బోర్డు 12వ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. అయితే, ఈ ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం కోసం కొత్తగా తీసుకొచ్చిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వల్లే తమకు తక్కువ మార్కులు వచ్చాయని కొంతమంది విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన బోర్డు.. విద్యార్థులకు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అందిస్తామని, వాటిని సరిచూసుకొని రీవాల్యూయేషన్కు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే, ఈ పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థుల నుంచి ఫిర్యాదులొచ్చాయి.

# అన్నామలైకి అనూహ్య స్పందన

(మొదటి పేజీ తరువాయి)

లక్షల మంది జైకొడుతున్నారు. ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్ సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలె

(మొదటి పేజీ తరువాయి)

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్లు నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్లు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలి?' అని ఆయన ప్రశ్నించారు.

ప్రధాన్ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డీలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీకులు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్ మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

**వాంగ్ చుక్‌కు విద్యాశాఖను అప్పగించాలె**

జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే, తనకు రాజకీయాల్లో ప్రవేశించాలే ఆలోచన లేదని ఆయనస్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్నిఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, సీజేపీ తమ తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్ లీలా మైదాన్లో నిర్వహించనున్నట్టు సమాచారం.

# నీళ్లు దొర్కక 49మంది మృతి

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్ తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.

చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు.

# విద్యాశాఖలో డిప్యూటీ ఈవో, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ పోస్టుల భరీకి నోటిఫికేషన్

## 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

## పునర్వ్యవస్థీకరణ తర్వాత నియామక ప్రక్రియను వేగవంతం చేసిన కమిషన్

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** ఎన్నో రోజులుగా కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్న తెలంగాణ నిరుద్యోగులకు టీజీపీఎస్సీ రెండు రోజుల క్రితం మరో తీపికబురు అందించిన విషయం తెలిసిందే. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువుల కోసం పడిగాపులు కాస్తున్న వారికి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌లతో గత కొంత కాలంగా వరుస శుభవార్తలు.. నియామక ప్రక్రియలో స్పష్టమైన వేగం కనబరుస్తూ... కేవలం 4 రోజుల వ్యవధిలోనే రెండో కీలక ఉద్యోగ ప్రకటనలను జారీ చేసింది. రాష్ట్ర విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణను బలోపేతం చేసే లక్ష్యంతో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ (డీవైఈవో), గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-1 పోస్టుల భర్తీకి అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది.

# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



హైదరాబాద్, జూన్ 6,(మనం న్యూస్)ః రాష్ట్రంలో నీట్ పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం సచివాలయం అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను అదేశించారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వెల్లడించారు.

**సమన్వయంతో పనిచేయాలిః**

పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని సీఎస్ అధికారులకు సుచించారు. ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు పరీక్షకు చేపట్టిన ఏర్పాట్లపై సమావేశాంలో వివరించారు. పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా, భద్రత, విద్యుత్ సరఫరా, తాగునీరు, ఇతర సౌకర్యాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్ మాట్లాడుతూ, పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిరంతర అప్రమత్తత పాటించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. పుకార్లు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ, పరీక్షల నిర్వహణపై ప్రభావం చూపే తప్పుడు సమాచారాన్ని వెంటనే గుర్తించేందుకు సామాజిక మాధ్యమాలను చురుకుగా పర్యవేక్షించాలని సూచించారు.జాతీయ పరీక్షా సంస్థ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షల కోసం మరింత కట్టుదిట్టమైన భద్రతా విధానాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా ప్రశ్నాపత్రాల రవాణా కోసం తొలిసారిగా భారత వైమానిక దళం సేవలను వినియోగిస్తున్నామని, పరీక్షల సమగ్రత, భద్రతకు ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

**కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలిః**

వరి ధాన్యం కొనుగోలు కార్యక్రమాలను సమీక్షించిన ప్రధాన కార్యదర్శి, రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే కొద్ది రోజుల పాటు కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కోత పూర్తయిన ధాన్యాన్ని రక్షించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఇంకా ధాన్యం నిల్వ ఉన్న ప్రాంతాల్లో కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు.సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి, 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**విస్తృత ఏర్పాట్లు చేయాలిః**

ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో చేపట్టనున్న పర్యటనల ఏర్పాట్లను కూడా ప్రధాన కార్యదర్శి సమీక్షించారు. పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల మధ్య సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. బహిరంగ సమావేశాలు, భద్రత, రవాణా, వసతి, ఇతర లాజిస్టిక్ అవసరాలకు సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సీవీ ఆనంద్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానా కిషోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఈఓ దివ్య, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# పోచంపల్లి ఇక్కత్ తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

**చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం బాసట**

**'త్రెడ్ పోచంపల్లి' ప్రదర్శన సందర్శించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, జూన్ 6: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళాత్మక నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన పోచంపల్లి ఇక్కత్ ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడం ప్రతి తెలంగాణవాసికి గర్వకారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో నిర్వహిస్తున్న 'త్రెడ్ పోచంపల్లి' ప్రత్యేక ప్రదర్శనలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... పోచంపల్లి ఇక్కత్ కేవలం ఒక వస్త్ర కళ మాత్రమే కాదని, అది తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సృజనాత్మకత, సంప్రదాయ జీవన విధానానికి అద్దం పట్టే అద్భుత కళారూపమని ఆయన అభివర్ణించారు. రంగుల సమన్వయం, నూలు పోగుల్లో కనిపించే అపూర్వమైన డిజైన్లు, తరతరాలుగా వస్తున్న కళాత్మక నైపుణ్యం వల్ల పోచంపల్లి ఇక్కత్ ప్రపంచ ఫ్యాషన్ రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని చెప్పారు. చేనేత కార్మికుల కష్టం, పట్టుదల, నైపుణ్యం వల్లే పోచంపల్లి పేరు ప్రపంచ పటంలో నిలిచిందని మంత్రి కొనియాడారు. ఒక చీర తయారీ వెనుక కుటుంబమంతా కలిసి చేసే శ్రమ, సృజనాత్మకత, అంకితభావం దాగి ఉంటుందని అన్నారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు, ఆర్థిక సహాయం, శిక్షణ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాల పెరుగుదల ద్వారా వేలాది కుటుంబాలకు ఉపాధి భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. యువత కూడా చేనేత రంగం వైపు ఆకర్షితులయ్యేలా ఆధునిక డిజైన్లు, కొత్త మార్కెటింగ్ విధానాలు, డిజిటల్ వేదికల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 'త్రెడ్ పోచంపల్లి' ప్రదర్శన ద్వారా పోచంపల్లి ఇక్కత్కు మరింత ప్రాచుర్యం లభించి, చేనేత కార్మికుల ఆదాయం పెరగాలని ఆయన ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు, సంప్రదాయ కళల పరిరక్షణ విషయంలో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

# 'నందూస్ వరల్డ్'పై పోలీసు అలర్ట్

- నమ్మి మోసపోవద్దని నిరుద్యోగులకు హితవు

హైదరాబాద్,జూన్ 6(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః నందూస్ వరల్డ్ దంపతుల వీసా మోసాలపై పోలీసులు కీలకమైన అలెర్ట్ పోస్ట్ చేశారు. 'నందూస్ వరల్డ్' యూట్యూబ్ ఛానల్ ద్వారా లగ్జరీ లైఫ్‌స్టైల్‌ను చూపిస్తూ నిరుద్యోగుల నుంచి డబ్బులు దండుకోవడానికి యత్నిస్తున్నారని పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు, వీసాల పేరుతో జరిగే మోసపూరిత వలలో చిక్కుకోవద్దని నిరుద్యోగులను హితవు పలికారు.

ఇటీవల లండన్ నుంచి వచ్చిన శివ క్రాంతి కుమార్ తన వీసా రెన్యువల్, భార్య ఉద్యోగం కోసం ఈ దంపతుల 'డెస్టినీ కన్సల్టెన్సీ'ని నమ్మి రూ.15 లక్షలు ఇచ్చి మోసపోయారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు నిందితులు 'అగార్డ్ సొల్యూషన్స్' పేరుతో ఒక నకిలీ స్పాన్సర్షిప్ లెటర్ సృష్టించినట్లు తేలింది. బాధితుడి ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసులు మధుకర్, రమానందన, మోహన్‌రావులపై కేసు నమోదు చేశారు. నిందితులు విచారణకు సహకరించకపోవడంతో పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు.

# లాలూ ప్రసాద్‌కు సెక్యూరిటీ ఉపసంహరణ

పాట్నా, జూన్ 6: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ , ఆయన భార్య రబ్రీదేవికి ఉన్న జడ్ ప్లస్ సెక్యూరిటీని ఇటీవల బీహార్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఆ స్థానంలో బీహార్ ప్రత్యేక సాయుధ పోలీసులతో భద్రత కల్పించింది. అయితే ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించిన లాలూ కుటుంబం తమకు కేటాయించిన భద్రత వద్దంటూ సిబ్బందిని తమ నివాసం నుంచి పంపివేసింది. ఈ క్రమంలోనే పట్నాలోని 10- సర్క్యులర్ రోడ్‌లో ఉన్న లాలూ నివాసం వద్ద పలువురు ఆర్జేడీ నేతలు కర్రలు పట్టుకొని కాపలా కాస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. బీహార్ ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న లాలూ కుమారుడు తేజస్వీయాదవ్‌కు ఉన్న వై-ప్లస్ భద్రతను అలాగే ఎంపీ మిసా భారతికి ఉన్న భద్రతను యథావిధిగా కొనసాగించనున్నట్లు బీహార్ ప్రభుత్వం వెల్లడించింది. కాగా లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు తేజస్వి ప్రతాప్ యాదవ్‌కు ఉన్న వై-ప్లస్ భద్రతను తొలగించి ఓ కానిస్టేబుల్‌ను ఏర్పాటుచేసింది. తన తల్లిదండ్రులకు భద్రత తొలగించడంపై తేజస్వీ యాదవ్ బిహార్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ.. తనకు కల్పించిన వై-కేటగిరీ భద్రతను వెనక్కి పంపించేశారు. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య మాట్లాడుతూ తమ కుటుంబానికి హాని కలిగించాలనే దురుద్దేశంతోనే రాష్ట్రప్రభుత్వం జడ్ ప్లస్ సెక్యూరిటీని తొలగించిందని ఆరోపించారు. బిహార్ తొలి మహిళా సీఎం అయిన తన తల్లిపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

# గండికోట టు చంచల్‌గూడ

- వైసీపీ మాజీ ఎమ్మెల్యేకు రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలింపు

హైదరాబాద్,జూన్ 6(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః హైదరాబాద్ గండిపేటలో ప్రభుత్వ భూములను కాజేసేందుకు యత్నించిన కేసులో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బ్రహ్మనాయుడిని తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలో అరెస్ట్ చేసిన పోలీసులు, అక్కడ కోర్టులో ట్రాన్సిట్ వారెంట్ తీసుకొని హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్ సీపీ కార్యాలయంలో గండిపేట భూముల కోసం సృష్టించిన నకిలీ పత్రాలపై విచారించారు. అలాగే ఈ కేసులో నిమ్మల దశరథ్ కుటుంబంతో లావాదేవీలు, కుదిరిన ఒప్పందాలు, వారి ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేసిన కోట్ల రూపాయల నగదు పైనా పోలీసులు ప్రశ్నించారు. వెల్ది రాధాకృష్ణ ద్వారా నకిలీ స్టాంపులు, నకిలీ జీవోల తయారీపైనా పోలీసులు ఆరాతీశారు. రాధాకృష్ణకు బదిలీ చేసిన నగదు గురించి ప్రశ్నించినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ అయిన వారి నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ కేసులో కీలక నిందితుడు బ్రహ్మనాయుడిని ఉప్పరపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు ఈనెల 19 వరకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడు బ్రహ్మనాయుడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# 'చేప ప్రసాదం' పంపిణీకి సర్వం సిద్ధం

- రేపు రాత్రి 9 గంటల నుంచి పంపిణీ
- క్యూలైన్ లల ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు
- సీపీఆర్ బృందాలు, అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు సిద్ధం
- షీ టీమ్స్ నిఘా.. కంట్రోల్ రూమ్‌తో నిరంతర పర్యవేక్షణ



హైదరాబాద్, జూన్ 6(మనం న్యూస్)ః హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేసే ప్రసిద్ధ 'చేప ప్రసాదం' కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. రేపటినుండి ప్రారంభం కానున్న ఈ పంపిణీ కార్యక్రమాలకు ఏర్పాట్లను శనివారం హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వాకిటి శ్రీహరి కలిసి అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్యూలైన్లు, మౌలిక వసతులు, భద్రతా చర్యలపై అధికారులకు వారు పలు కీలక సూచనలు చేశారు.

**ఈసారి రాత్రి నుంచి ప్రారంభం :**

సాధారణంగా ప్రతి ఏటా మృగశిర కార్తె ఉదయం పూట ప్రవేశిస్తుందని, అయితే ఈసారి సోమవారం రాత్రి మృగశిర కార్తె వస్తుండటంతో పంపిణీ సమయాల్లో మార్పులు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈనెల 8వ తేదీ రాత్రి 9 గంటలకే చేప ప్రసాదం పంపిణీ ప్రారంభమవుతుందని, రాత్రి వేళల్లో వస్తున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ప్రసాదం మరుసటి రోజు రాత్రి వరకు ఈ పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. వందల సంవత్సరాలుగా ఈ చేప ప్రసాదంపై ప్రజలకు అచంచలమైన విశ్వాసం ఉందని, అందుకే ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తుల కోసం స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వసతి, ఆహార సౌకర్యాలు కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**ప్రత్యేక వసతులుః**

ప్రస్తుతం ఎండలు, ఉక్కపోత ఎక్కువగా ఉన్నందున క్యూలైన్లలో నిల్చునే ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా పెద్ద ఎత్తున ఫ్యాన్లు, కూలర్లను ఏర్పాటు చేయాలని మంత్రులు ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, అవసరమైన మందులు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ముఖ్యంగా క్యూలైన్ల మధ్యలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా సీపీఆర్ బృందాలను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించేందుకు ఫైర్ ఇంజన్ వాహనాలను కూడా గ్రౌండ్‌లో ఉంచాలన్నారు.

**భద్రత, పర్యవేక్షణపై కఠిన ఆదేశాలుః**

క్యూలైన్లలో ఎలాంటి తొక్కిసలాట జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రులు స్పష్టం చేశారు. రద్దీని ఆసరాగా చేసుకుని జేబుదొంగతనాలు (పిక్ పాకెట్) జరగకుండా మైకుల ద్వారా నిరంతరం అవగాహన కల్పించాలని, మహిళల రక్షణ కోసం 'షీ టీమ్స్' రంగంలోకి దించాలని ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకోసం ప్రత్యేక వాట్సప్ గ్రూపుల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా మొత్తం ప్రక్రియను మానిటరింగ్ చేయాలని అధికారులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం

- ఇద్దరు నిందితులపై పొక్సో కేసు

హైదరాబాద్,జూన్ 6(మనం,ప్రత్యేక ప్రతినిధి)ః మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. శంకర్‌పల్లి పట్టణానికి చెందిన ఓ మైనర్ బాలికకు మూడు నెలల కిందట 28 ఏళ్ల వ్యక్తి పరిచయమయ్యాడు. సదరు యువకుడు అమ్మాయితో చనువు పెంచుకొని ఆమె పై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అలాగే ఈనెల 1వ తేదీన మరో యువకుడు సైతం బాలిక పై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల రాత్రివేళ బాలిక బయటికి వెళ్లి రావడం ఒంటి పై గాయాలను చూసి తల్లి గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయాన్ని తల్లికి తెలిపింది. దీంతో తల్లి శంకరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వెంటనే బాలికను శంషాబాద్ లోని భరోసా కేంద్రానికి తరలించి పరీక్షలు నిర్వహించారు. నిందితులు అఘాయిత్యానికి పాల్పడినట్లు తేలడంతో వారిపై పొక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# అవును... వాళ్లిద్దరు కుమ్మక్కైండ్రు?

- కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డ హరీశ్



హైదరాబాద్, మనం ప్రతినిధి : పాలమూరు ప్రాజెక్టు సందర్శనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి 'మతిలేని మాటలు' అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. సీఎం రెండు రోజుల పర్యటననుద్దేశించి మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ... బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతోనే సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందని, సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టం చేశారు. 'అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదు. సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారు. అయితే, ఈ ఏడాది కూడా మన పొరుగున ఉండే ఏపీ రాష్ట్రం 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైంది' అని హరీశ్ రావు ఆరోపించారు. అయితే, ఈ వైఫల్యానికిగానూ కారణమైన సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని ఆయన గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందని, రాబోయే రోజుల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని మళ్లీ ఓడించి, పాలమూరు గడ్డపై గులాబీ జెండా ఎగరేస్తామని హరీశ్ రావు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

# సింగరేణిలో భారీ కుంభకోణం

- రూ.1,600 కోట్ల బొగ్గు మాయంపై.. న్యాయ విచారణకు కేటీఆర్ డిమాండ్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాసిన కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో సుమారు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు (కేటీఆర్) సంచలన ఆరోపణలు చేశారు. ఈ భారీ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి కేటీఆర్ ఒక లేఖ రాశారు. సింగరేణిలోని పలు స్టాక్ యార్డులలో బొగ్గు నిల్వల నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. రికార్డుల ప్రకారం బొగ్గుపై సెస్, ఆదాయపు పన్ను చెల్లించినప్పటికీ, క్షేత్రస్థాయి తనిఖీల్లో నిల్వల మధ్య భారీ వ్యత్యాసం కనిపించిందని వివరించారు. ఈ వ్యవహారం వెనుక బొగ్గును అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్‌లో విక్రయించిన భారీ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. అయితే, ప్రధానంగా ఈ కుంభకోణం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని, లేదా బాధ్యులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు.

ఈ విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ మంత్రులకు మధ్య లోపాయికారీ సంబంధాలు ఉన్నాయేమోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అందుకే కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ స్కామ్‌ను బయటపెట్టకుండా ఉండేందుకే తమ పార్టీ నేతలను అరెస్టు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.

# సనత్‌నగర్ టిమ్స్ రెడీ..

- సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు
- గుండె జబ్బులు, అవయవ మార్పిడికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా టిమ్స్
- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యం
- టిమ్స్‌లో ఏర్పాట్లపై మంత్రి దామోదరా సమీక్ష



హైదరాబాద్,జూన్ 6(మనం న్యూస్)ః హైదరాబాద్ సనత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన అత్యాధునిక టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ ఆసుపత్రిని సందర్శించి, ప్రారంభోత్సవ ఏర్పాట్లు , హాస్పిటల్ సంసిద్ధతపై అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఉచితంగా అందించాలన్న ముఖ్యమంత్రి లక్ష్యానికి అనుగుణంగానే ఈ సరికొత్త వైద్య సంస్థను తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**క్షేత్రస్థాయి పరిశీలనః**

హాస్పిటల్‌లోని ఎ,బి,సీ బ్లాకులను మంత్రి దామోదర్ రాజనర్సింహ స్వయంగా సందర్శించారు. అందులో భాగంగా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇన్‌పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం, ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. అలాగే సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్రే, అల్ట్రాసౌండ్ తదితర ఆధునిక రేడియాలజీ యంత్రాల పనితీరును, డయాగ్నస్టిక్స్ ల్యాబొరేటరీలు, బ్లడ్ బ్యాంక్, మెకనైజ్డ్ ల్యాండ్రీ, సెంట్రలైజ్డ్ కిచెన్ , ఫార్మసీ విభాగాలను క్షుణ్ణంగా



తనిఖీ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక వైద్య పరికరాలు, మౌలిక వసతులు, సేవల నిర్వహణ వ్యవస్థలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.

**పెండింగ్ పనులు పూర్తి చేయాలిః**

ఆసుపత్రి అధికారికంగా ప్రారంభం కావడానికి ముందే పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ , సాంకేతిక పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతర నీటి సరఫరా, విద్యుత్, పారిశుధ్యం, సెక్యూరిటీ , ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేయాలని సూచించారు. రోగుల రద్దీని తట్టుకునేలా ఓపీ కౌంటర్లు, హెల్ప్ డెస్కులు, వెయిటింగ్ ఏరియాలను మరింత పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు ఆధునిక వైద్య యంత్రాలు పూర్తిస్థాయిలో రోగులకు సేవలు అందించేలా, వాటిని నిర్వహించడానికి అవసరమైన స్పెషలిస్ట్ డాక్టర్లు, టెక్నీషియన్లు , ఇతర సహాయక సిబ్బందిని ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ః**

సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌ను ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధుల (కార్డియాలజీ) చికిత్సలకు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు ఒక ప్రముఖ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఇందుకోసం ప్రత్యేక క్యాథ్‌లాబ్‌లు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు , అవయవ మార్పిడి సదుపాయాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించగల అత్యుత్తమ సంస్థగా టిమ్స్ నిలవాలన్నారు. కేవలం రోగులకే కాకుండా, వారితో పాటు వచ్చే సహాయకుల కోసం ధర్మశాల (వసతి గృహం), నాణ్యమైన క్యాంటీన్లు, విశాలమైన పార్కింగ్ సదుపాయాలు , హాస్టల్ బ్లాకులను కూడా సమగ్రంగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు.

## గుండెలో కెలికినట్టుంది

గుండెలో కెలికినట్టుంది
ప్రశాంతంగా పారుతున్న
సెలయేరును మలుపుకున్నట్లు
ఇంతింత రమ్మంటే  ఇల్లంతా వచ్చినట్లు
తెలంగాణ గడ్డమీద నీలి నీడలు కమ్ముతున్నట్లు
కంచంలో అన్నం లాగుకున్నట్లు
భుజం మీద చెయ్యేసి కండువా
మాయం చేసినట్లు
నిద్రను లాక్కుపోయినట్లు
కలొస్తుంది
తెలంగాణ పోరులో అసువులు
బాసిన విద్యార్థులు
జాగో జాగో అంటున్నట్లు
నీళ్లు ,నియామకాలు, నిధులు
అటువైపు పారుతున్నట్లు
తెలంగాణ తలుపులు తోసుకొచ్చి సవాలు
విసిరినట్లు
ఏవో మంత్రిచ్చిన నీళ్లు చల్లి కొందరిని
 వాళ్ల కాళ్ల దగ్గర బంధించినట్లు
పీడకల వస్తుంది
తెలియకుండానే గుండె కురుస్తుంది
నా తెలంగాణ ఆత్మ క్షోబిస్తుంది
ఆత్మీయ పలకరింపు కోసం ఎదురుచూస్తుంది

**- గుండెల్లి ఇస్తారి**
9849983874

## ఎక్కుపెట్టిన కవిత్వం

ఉల్కల్లా రాలుతున్న సమస్యలు
వడగళ్ళు కురుస్తున్న బాధలు
సూర్యోదయపు కిరణాల ములుగర్రలు
వెన్నెలకాంతి శూలాలు
చీకటి వెలుతురుతో సంబంధం లేకుండా
నిద్ర మెలకువను ఖాతరు చేయకుండా
నీరసపడిపోకుండా అదేపనిగా దాడి చేస్తున్నాయి
నిత్యం దహించి వేస్తున్నాయి
ఆకలితో నీరసపడిపోకుండా
అనుక్షణం అంకుశంతో పొడుస్తున్నాయి
తక్కువ ఎక్కువనే కొలమానం లేకుండా
గడియారంలోని 24 గంటలను అంటిపెట్టుకొని
నా చుట్టూ తిరుగుతున్నాయి
ఊరించే నిద్ర కంటిపాపలపై రెప్పలను
కప్పివేసినప్పుడు
దూరం జరిగినట్లే జరిగి దాడి చేస్తున్నాయి
రెప్పలు తెరుచుకుంది మొదలు
సూదిమొనల్లా చురుక్కుమనిపిస్తున్నాయి
రాయని కవిత్వంలా
వెక్కిరిస్తున్న తెల్లకాగితంలా
కరుణించని కలంలా
బాధకు పర్యాయపదంలా మారిన కవిత

**- కోడం పవన్కుమార్**
9848992825

## కనపడని గాయం

తోడనుకున్న  బంధపు  మోసపు ఆలోచన
ఎదను మీటినప్పుడల్లా..!
దుఃఖపు అలలు  మనసు తీరాన్ని
తాకుతూనే ఉన్నాయి.

వెలకట్టని ప్రేమలు కురిపించి
నాతోనే అడుగులేసి
నీ మది కి స్వార్థపు లేపనం రాసుకొని
మాటలు బాణాలు విసిరి
నన్ను  చీకటిలో దోషిగా నిలబెట్టావు.

నేను చేసిన తప్పేమిటో
నా మదిని ఎంతలా చిలికినా
ఫలితం శూన్యం
నమ్మకం హద్దులు దాటుతే
మోసం  తేలికవుతుంది కాబోలు!

నీ మోసపు  విషపు స్మ ృతులు
 గుప్పుమంటూ మదిని తాకినప్పుడు
నా మనసు కాలిన వాసన వస్తుంది
బయటకు కనబడని గాయం
సలపరం అలానే ఉంది.

**- చింతా రాంబాబు**
9948178092

# ఉపాధి యుద్ధం... కాక్రోచ్ ప్రభంజనం



భారత రాజకీయ చరిత్రలో ఎన్నో రాజకీయ పార్టీలు, ఉద్యమాలు, ప్రజా పోరాటాలు పుట్టుకొచ్చాయి. అయితే 2026లో సామాజిక మాధ్యమాల వేదికగా ఉద్భవించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అనే వినూత్న ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇది సంప్రదాయ రాజకీయ పార్టీగా కాకుండా వ్యంగ్యం, నిరసన, యువత అసంతృప్తి, నిరుద్యోగ సమస్యల సమ్మేళనంగా రూపుదిద్దుకున్న సామాజిక-రాజకీయ ఉద్యమం. కొద్ది రోజుల వ్యవధిలోనే లక్షలాది మంది యువతను ఆకర్షించి, కోట్లాది మంది సామాజిక మాధ్యమ వినియోగదారుల దృష్టిని ఆకర్షించడం దీని ప్రత్యేకత.

ఈ ఉద్యమానికి నేపథ్యంగా నిలిచింది భారత యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, పరీక్షల పేపర్ లీకేజీలు, పెరుగుతున్న జీవన వ్యయాలు, అవకాశాల కొరత వంటి సమస్యలు. 2026 మే నెలలో జరిగిన ఒక న్యాయస్థాన విచారణ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి కాక్రోచ్లు, పరాన్నజీవులు అనే వ్యాఖ్యలు వెలువడ్డాయని ప్రచారం జరిగింది. ఆ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఈ వ్యాఖ్యలను అవమానంగా కాకుండా ప్రతిఘటనకు ప్రతీకగా మార్చుకోవాలని కొందరు యువకులు నిర్ణయించారు. అలా నేనూ కాక్రోచ్నే అనే నినాదంతో కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవించింది.

ఈ ఉద్యమానికి ప్రధాన రూపకర్తగా నిలిచిన వ్యక్తి అభిజీత్ దీప్కే. మహారాష్ట్రకు చెందిన పొలిటికల్ కమ్యూనికేషన్స్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దీప్కే మే 2026లో ఈ వినూత్న వేదికను ప్రారంభించారు.

ప్రజాసంబంధాల రంగంలో అనుభవం కలిగిన ఆయన, మొదట దీనిని సామాజిక మాధ్యమ వ్యంగ్య ప్రచారంగా ప్రారంభించినప్పటికీ, అనూహ్య స్పందన రావడంతో అది విస్తృత యువజన ఉద్యమంగా మారింది. ప్రారంభమైన మూడు నుంచి ఐదు రోజుల్లోనే లక్షలాది మంది సభ్యత్వం తీసుకోవడం, కోట్లాది మంది సామాజిక మాధ్యమ అనుచరులు చేరడం విశేషంగా చెప్పుకోవాలి. వివిధ నివేదికల ప్రకారం ఈ ఉద్యమం ఇన్స్టాగ్రామ్లో కొన్ని ప్రధాన రాజకీయ పార్టీల కంటే వేగంగా అనుచరులను సంపాదించింది.

కాక్రోచ్ జనతా పార్టీ విజయానికి ప్రధాన కారణం యువత మనోభావాలను ప్రతిబింబించడమే. దేశంలో ప్రతి సంవత్సరం కోట్లాది మంది యువకులు ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, అందరికీ తగిన ఉపాధి అవకాశాలు లభించడం లేదు. డిగ్రీలు, సాంకేతిక విద్య, పోటీ పరీక్షల్లో విజయాలు సాధించినప్పటికీ ఉద్యోగాల కొరత కారణంగా అనేక మంది నిరాశకు గురవుతున్నారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల ఆలస్యం వంటి అంశాలు యువతలో అసంతృప్తిని మరింత పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ యువత అసంతృప్తికి ఒక ప్రతీకగా మారింది.

ఈ ఉద్యమం సంప్రదాయ రాజకీయ భాషను కాకుండా మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, హాస్య పోస్టులు, సామాజిక మాధ్యమ ప్రచారాలను ఆయుధాలుగా ఉపయోగించింది. రాజకీయ విమర్శలను వినోదాత్మకంగా ప్రజలకు చేరవేయడం ద్వారా యువతలో విశేష ఆదరణ పొందింది. సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజీ అనే నినాదాన్ని స్వీకరించడం కూడా వ్యంగ్య రాజకీయాలకు ఉదాహరణగా నిలిచింది. నిరుద్యోగ యువతను సోమరులుగా చిత్రీకరించే సామాజిక ధోరణిపై ఇది పరోక్ష విమర్శగా భావించ బడుతోంది.

సామాజిక మాధ్యమాల ప్రభావం ఆధునిక రాజకీయాల్లో ఎంతగా పెరిగిందో కాక్రోచ్ జనతా పార్టీ మరోసారి నిరూపించింది. గతంలో రాజకీయ పార్టీలు ప్రజలను చేరుకోవడానికి భారీ సభలు, యాత్రలు, ప్రచార కార్యక్రమాలపై ఆధారపడేవి. ఇప్పుడు ఒక వైరల్ ప్రచారం కొన్ని రోజుల వ్యవధిలోనే జాతీయ స్థాయి చర్చకు దారి తీస్తోంది. ఈ ఉద్యమం పూర్తిగా డిజిటల్ వేదికల ఆధారంగా ఎదగడం కొత్త తరహా రాజకీయ చైతన్యానికి సంకేతంగా భావించ బడుతోంది.

అయితే ఈ ఉద్యమంపై విమర్శలు కూడా ఉన్నాయి. కొందరు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఇది నిజమైన రాజకీయ పార్టీ కంటే తాత్కాలిక సామాజిక మాధ్యమ ధోరణి మాత్రమే కావచ్చు. వైరల్ ప్రచారం వల్ల ఏర్పడే ప్రజాదరణను స్థిరమైన రాజకీయ శక్తిగా మార్చడం అంత సులభం కాదని వారు చెబుతున్నారు. సభ్యత్వాలు, అనుచరులు ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని ఓట్లుగా, సంస్థాగత బలంగా, రాజకీయ ప్రభావంగా మార్చడం ఒక పెద్ద సవాలుగా ఉంటుంది.

మరోవైపు మద్దతుదారులు మాత్రం దీనిని ఒక రాజకీయ పార్టీగా కాకుండా యువత స్వరంగా చూడాలని వాదిస్తున్నారు. ఉద్యోగాలు, విద్య, సామాజిక న్యాయం, ఆర్థిక అవకాశాలు వంటి అంశాలపై ప్రభుత్వం మరియు రాజకీయ వ్యవస్థ దృష్టి సారించేలా ఒత్తిడి తీసుకురావడమే తమ లక్ష్యమని చెబుతున్నారు. ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో విద్యా సంస్కరణలు, పరీక్షల పారదర్శకత, యువత సమస్యల పరిష్కారం వంటి డిమాండ్లు ముందుకు వచ్చాయి.

భారతదేశ జనాభాలో యువత శాతం అత్యధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి ఉద్యమాలు సామాజిక, రాజకీయ రంగాలపై ప్రభావం చూపే అవకాశముంది. దేశంలో సుమారు 40 కోట్లకు పైగా యువజన జనాభా ఉండగా, వారిలో ఉపాధి, విద్య, నైపుణ్యాభివృద్ధి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ వాస్తవాలను రాజకీయ వ్యవస్థ సమర్థవంతంగా పరిష్కరించలేకపోతే భవిష్యత్తులో మరిన్ని డిజిటల్ ఉద్యమాలు ఉద్భవించే అవకాశం ఉంది.

కాక్రోచ్ జనతా పార్టీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఇప్పుడే ఖచ్చితంగా చెప్పలేము. ఇది కేవలం కొన్ని వారాలపాటు కొనసాగే సామాజిక మాధ్యమ అలజడిగా మిగిలిపోవచ్చు. లేదా యువత సమస్యలను కేంద్రంగా చేసుకుని కొత్త తరహా రాజకీయ ఉద్యమంగా పరిణమించవచ్చు. అయితే ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. యువతను నిర్లక్ష్యం చేసే రాజకీయ వ్యవస్థకు, నిరుద్యోగం వంటి సమస్యలను తక్కువ అంచనా వేసే అధికార వర్గాలకు ఈ ఉద్యమం ఒక హెచ్చరిక సంకేతంగా మారింది. ఒక అవమానకర పదాన్ని నిరసన చిహ్నంగా మార్చుకొని, దానిని కోట్లాది మంది యువత భావోద్వేగాలతో అనుసంధానించడం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ ఆధునిక భరత రాజకీయ చరిత్రలో ఒక విశిష్ట అధ్యాయంగా నిలిచింది. డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాల శక్తి, యువత అసంతృప్తి, రాజకీయ వ్యంగ్యం కలిసి సృష్టించిన కొత్త రాజకీయ ప్రయోగంగా ఇది అధ్యయనం చేయదగిన అంశంగా మారింది. ప్రస్తుతం అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో పబ్లిక్ రిలేషన్స్ చదువుతున్న అభిజీత్ దీప్కే, పరీక్షల లీకేజీలకు వ్యతిరేకంగా శాంతియుత నిరసన తెలపడానికి జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారు. ఇందుకోసం ఆయన

# విద్య వ్యాపారంతో నష్టపోతున్న విద్యార్థులు




విద్య అనేది ప్రతి పౌరుని ప్రాథమిక హక్కు. దేశ భవిష్యత్తును నిర్మించేది విద్యే. అలాంటి విద్య ధనికులకు మాత్రమే కాకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో ఉండాలి. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో అనేక లోపాలు ఉండగా, మరోవైపు ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులతో తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యా వ్యవస్థలో.ఈ రెండు సమస్యలు ప్రధాన సవాళ్లుగా మారాయి.

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యకు చిరునామాగా ఉండేవి. గ్రామీణ ప్రాంతాల్లోని వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. అయితే కాలక్రమేణా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల విశ్వాసం కొంత తగ్గింది. దీనికి ప్రధాన కారణాలు మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, పర్యవేక్షణ లోపం, నిర్వహణలో నిర్లక్ష్యం.

చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సరైన తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, క్రీడా మైదానాలు లేకపోవడం కనిపిస్తోంది. కొన్ని చోట్ల ఒకే ఉపాధ్యాయుడు అనేక తరగతులకు బోధించాల్సిన పరిస్థితి ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే ప్రభుత్వం విద్యా రంగానికి మరింత నిధులు కేటాయించి, అవసరమైన అన్ని వసతులను కల్పించాలి.

అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉంది. అనేక పాఠశాలల్లో సమస్యలు ఉన్నప్పటికీ సకాలంలో తనిఖీలు నిర్వహించడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలలను సందర్శించి బోధన, హాజరు, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను పరిశీలించాలి. పర్యవేక్షణ వ్యవస్థ బలంగా ఉన్నప్పుడే ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

మరోవైపు ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుకుంటున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, వార్షిక ఫీజులు, బస్సు ఫీజులు, యూనిఫామ్లు, పుస్తకాలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక విద్యార్థి చదువు కోసం తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యతరగతి కుటుంబాలు ఈ ఫీజుల భారాన్ని భరించలేక అప్పులు చేయాల్సి వస్తోంది. పిల్లల భవిష్యత్తు కోసం తమ ఆర్థిక పరిస్థితిని పక్కనబెట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఫీజులు చెల్లించలేదని విద్యార్థులను అవమానించడం, పరీక్షలకు అనుమతించకపోవడం వంటి ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ఇంకా ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు కొనసాగుతున్నప్పటికీ వాటిపై కఠిన చర్యలు తీసుకోవడం లేదు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలకు తగిన స్థల విస్తీర్ణం, విశాలమైన తరగతి గదులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, భద్రతా ప్రమాణాలు, ఆటస్థలం (ప్లేగ్రౌండ్) తప్పనిసరిగా ఉండాలి. కానీ అనేక ప్రాంతాల్లో ఇరుకు గదుల్లో, వాణిజ్య భవనాల్లో, కనీస మౌలిక వసతులు లేకుండానే పాఠశాలలు కొనసాగుతున్నాయి.

పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఆటస్థలాలు అత్యంత అవసరం. అయితే కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్లేగ్రౌండ్ లేకుండానే అనుమతులు పొంది కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇలాంటి పాఠశాలలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ చాలా చోట్ల నిర్లక్ష్యం కనిపిస్తోంది.

కొన్ని ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మరియు సంబంధిత విద్యాశాఖ అధికారుల మధ్య లోపాయికారీ ఒప్పందాలు ఉన్నాయనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఫలితంగా నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోవడం, తనిఖీలు కేవలం కాగితాలకే పరిమితం కావడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది విద్యా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది.

అదేవిధంగా విద్యా హక్కు చట్టం (ఖఊఉ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు ప్రవేశ స్థాయి తరగతుల్లో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన మరియు పేద కుటుంబాల విద్యార్థులకు ఉచితంగా కేటాయించాల్సి ఉంటుంది. ఈ నిబంధన విద్యలో సమాన అవకాశాలు కల్పించడానికి రూపొందించబడింది. అయితే అనేక ప్రాంతాల్లో ఈ నిబంధన పూర్తిస్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు యాజమాన్యాలు ఉచిత సీట్ల కేటాయింపులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండగా, అర్హులైన విద్యార్థులకు చట్టం కల్పించిన అవకాశాలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో కూడా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని యాజమాన్యాలు చెప్పుకున్నప్పటికీ, అధిక ఫీజులకు తగిన సేవలు అందుతున్నాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. విద్య అనేది వ్యాపార వస్తువు కాకూడదు. ప్రభుత్వం ఫీజు నియంత్రణ వ్యవస్థను బలోపేతం చేసి, అనధికార వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకీకరించడం ద్వారా మాత్రమే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. డిజిటల్ తరగతులు, ఆధునిక

## మురిపాల మాలిక

కొమ్మను పూయిస్తా -
కుసుమాల కిరీటాలు తొడిగిస్తా,
వసంతపు వేళల్లో
వన్నెల వేడుకలు జరిపిస్తా

రెమ్మలు తొడిగిస్తా -
పచ్చదనపు పట్టుచీరలు కప్పిస్తా,
గాలుల గుసగుసల్లో
గలగల గానాలు వినిపిస్తా

బొమ్మను చూపిస్తా -
అందాల అద్దంలో నిలబెడతా,
చూసే ప్రతి కన్నునూ
చిరునవ్వుల చినుకులు చిందిస్తా

గుమ్మను వర్ణిస్తా -
గులాబీలు గుర్తుకుతెస్తా,
గుబులును పుట్టిస్తా
గుండెలను పులకరింపజేస్తా

రమ్మని పిలుస్తా -
రాగాల పల్లకిలోకి ఆహ్వానిస్తా,
మనసుల మల్లెలతో
మమతల హారాలు అల్లిస్తా

ఇమ్మని కోరుతా -
ప్రేమను పరిమళాలను పంచమని అడుగుతా,
మానవతా మందిరంలో
మధుర బంధాలు నింపమంటా

కమ్మని కవితలు కూరుస్తా -
కావ్యసుమాలు పూయిస్తా,
మధుర భావసుధలతో
మనసులను మురిపిస్తా

**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్**
భాగ్యనగరం

# విద్వేషం.. రాజకీయాల కోసం మళ్లీ రగడ అవసరమా?



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం అనేది ఒక ప్రాంతం సాధించిన రాజకీయ విజయానికి మాత్రమే ప్రతీక కాదు. అది దశాబ్దాల వివక్షపై నిలిచిన ఆత్మగౌరవ జెండా. అలాంటి రోజున ప్రజలు అభివృద్ధి, స్వప్నాలు, భవిష్యత్తు గురించి మాట్లాడుకోవాల్సిన సమయంలో... మళ్లీ 'ఆంధ్రా-తెలంగాణ' అనే పాత గాయాలను రాజకీయ వేదికలపైకి లాగడం ఆందోళన కలిగించే పరిణామం.

రాష్ట్ర విభజనతో భౌగోళిక సరిహద్దులు ఏర్పడ్డాయేమో గానీ, తెలుగు ప్రజల మధ్య ఉన్న బంధాలు మాత్రం తెగిపోలేదు. వేలాది కుటుంబాలు, వ్యాపారాలు, ఉద్యోగాలు, స్నేహాలు ఇప్పటికీ రెండు రాష్ట్రాలను కలిపే వంతెనలుగా నిలిచాయి. అలాంటి సమయంలో రాజకీయ నాయకుల మాటలు మళ్లీ ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టేలా మారితే, అది కేవలం రాజకీయ వివాదం కాదు; భవిష్యత్ తరాలకు ప్రమాదకరమైన సందేశం.


పెత్తనమా? ప్రజాస్వామ్య హక్కా?

హైదరాబాద్లో జనసేన సభకు అనుమతి నిరాకరించడంపై స్పందిస్తూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. 'తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?' అంటూ ఆయన ప్రశ్నించడం, తనపై దాడులకు సిద్ధపడేవారికి సవాల్ విసరడం రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది.

ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీ అయినా దేశంలో ఎక్కడైనా పనిచేసే హక్కు కలిగి ఉంటుంది. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు దక్షిణాదిలో పోటీ చేయగలిగితే, జనసేన తెలంగాణలో ఎందుకు రాజకీయాలు చేయకూడదన్న పవన్ ప్రశ్నలో తార్కికత ఉంది. అయితే అదే సమయంలో తెలంగాణ అస్తిత్వాన్ని తాకే పదజాలం ఉపయోగించడం సహజంగానే ప్రతిస్పందనలకు దారితీసింది.

11 రోజుల ఉపవాసం - భిన్న కోణాలు

తెలంగాణ ఏర్పాటును తాను వ్యతిరేకించలేదని, పార్లమెంట్ తలుపులు మూసి విభజించిన విధానాన్ని నిరసిస్తూ 11 రోజులు అన్నం ముట్టలేదని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ తెలంగాణ సమాజంలోని ఒక వర్గం దానిని వేరే కోణంలో చూస్తోంది. విభజన సమయంలో చేసిన ఆ నిరసన తెలంగాణ ఆకాంక్షలకే వ్యతిరేకమని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.




పదేళ్లు దాటిన తర్వాత కూడా ఉద్యోగాలు, పరిశ్రమలు, అభివృద్ధి లోపాలకు 'ఆంధ్రోళ్లు కారణం' అనడం సరికాదన్న పవన్ వ్యాఖ్యలో వాస్తవికత ఉంది. కానీ అదే సమయంలో పాత గాయాలను మళ్లీ రాజకీయ చర్చల కేంద్రంగా మార్చడం సమాజానికి ఎంతవరకు మేలు చేస్తుందన్నది అసలు ప్రశ్న.

గద్దర్ ప్రస్తావన.. ప్రతి విమర్శల పర్వం

దివంగత ప్రజా గాయకుడు గద్దర్తో తనకున్న అనుబంధాన్ని ప్రస్తావించిన పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల జాగీరేనని, ఆత్మగౌరవాన్ని ఎవరూ కించపరచలేరని స్పష్టం చేశారు.

అటు కేటీఆర్ కూడా పవన్ను నటుడిగా గౌరవిస్తామని, కానీ తెలంగాణపై రాజకీయ పెత్తనం చెలాయించే ప్రయత్నాలను సహించబోమని పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయ అవసరాలకు పవన్ కల్యాణ్ పావుగా మారుతున్నారన్న విమర్శలు కూడా వినిపించాయి. ఈ పరస్పర ఆరోపణలు అసలు సమస్యను పక్కనబెట్టి రాజకీయ లాభనష్టాల చర్చకే పరిమితమవుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అవసరమైన సంయమనం

ప్రొఫెసర్ కోదండరామ్ చెప్పినట్లుగా, వ్యక్తుల మధ్య ఉండే రాజకీయ భేదాలను ప్రాంతాల మధ్య వైరంగా మార్చడం అత్యంత ప్రమాదకరం.

'ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరం' అని పవన్ కల్యాణ్ అన్న మాటలో ఎంత నిజం ఉందో, ఆ ప్రాంతీయ భావోద్వేగాలకు ఆజ్యం పోయకుండా ఉండాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.

ఈరోజు హైదరాబాద్లో ఆంధ్రా వ్యాపారవేత్తలు, విజయవాడలో తెలంగాణ పారిశ్రామికవేత్తలు, రెండు రాష్ట్రాల్లో లక్షలాది ఉద్యోగులు, విద్యార్థులు ఎలాంటి భేదాలు లేకుండా జీవిస్తున్నారు. ప్రజలు నిర్మించిన ఈ సహజ సహజీవనాన్ని రాజకీయ నాయకులు తమ ప్రసంగాలతో చెదరగొట్టే హక్కు ఎవరికీ లేదు.

ప్రజల హృదయాన్ని విభజించలేరు

తెలంగాణలో రాజకీయాలు చేసే హక్కు పవన్ కల్యాణ్కు ఉంది. అలాగే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించే బాధ్యత కూడా ఆయనపై ఉంది. అదే విధంగా, ప్రతి విభేదాన్నీ 'ఆంధ్రా పెత్తనం'గా చిత్రీకరిస్తూ రాజకీయ లబ్ధి పొందాలనుకునే ధోరణిని తెలంగాణ నాయకత్వం కూడా అధిగమించాలి.

ఎందుకంటే చరిత్ర ఒక గొప్ప పాఠం చెబుతుంది.. రాష్ట్రాలు విభజించవచ్చు, కానీ ప్రజల హృదయాలను విభజించలేరు. రాజకీయ నాయకులు ఎన్నికల కోసం సెంటిమెంట్లను రగిలించవచ్చు, కానీ ప్రజలు తమ జీవన ప్రయాణంలో సహజీవనాన్నే ఎంచుకుంటారు.

తెలంగాణ ఉద్యమం ద్వేషం కోసం జరగలేదు. ఆత్మగౌరవం కోసం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా శత్రువుగా నిలబడలేదు.. తన దారిలో ముందుకు సాగింది. కాబట్టి నేడు అవసరమైంది పాత గాయాలను గిల్లే రాజకీయాలు కాదు, కొత్త భవిష్యత్తును నిర్మించే నాయకత్వం.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- భద్రత, సమన్వయంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సీఎస్ రామకృష్ణారావు.
- వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా అధికారులకు ఆదేశాలు



**కామారెడ్డి, జూన్ 06 (మనంప్రతినిధి):** రాష్ట్రంలో నిర్వహించనున్న నీట్-2026 పరీక్షను ఎలాంటి అవాంతరాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని జిల్లాలు సమగ్ర ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో భద్రతా ప్రమాణాలు, సమన్వయం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు డీజీపీ మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. 208 కేంద్రాల్లో పరీక్ష. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ., రాష్ట్రవ్యాప్తంగా జూన్ 21న నిర్వహించనున్న నీట్-2026 పరీక్ష కోసం 24 పట్టణాల్లో 208 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 72,956 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో అన్ని జిల్లాలు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, రాష్ట్ర, జిల్లా స్థాయి సమన్వయ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వదంతులపై అప్రమత్తంగా ఉండాలి. సోషల్ మీడియాలో పరీక్షలకు సంబంధించి వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలపై వెంటనే స్పందించి వాటిని అరికట్టాలని అధికారులకు సూచించారు. ప్రశ్నపత్రాల రవాణా, అభ్యర్థుల నమోదు, బయోమెట్రిక్ ధృవీకరణ, తనిఖీలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో పరీక్ష నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వరి కొనుగోళ్లపై సమీక్ష. సమావేశంలో వరి ధాన్యం కొనుగోళ్లపై కూడా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. 4,488 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు పేర్కొన్నారు. 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాల్లో రూ.13,577 కోట్ల కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) చెల్లించినట్లు వెల్లడించారు. మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సమాఖ్యలకు 553 బస్సులు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్కో బస్సు చొప్పున మొత్తం 553 బస్సులు మంజూరు చేసినట్లు సీఎస్ తెలిపారు. ఈ బస్సులను జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు అందజేయనున్నట్లు చెప్పారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు, మహిళా సభ్యుల తరలింపు అంశాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి సిద్ధం కావాలి. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, ఇతర అవసరమైన సౌకర్యాల ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలతో నిఘా అదనపు డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ., పరీక్షా కేంద్రాలన్నింటిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై నిరంతర నిఘా ఉంచి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళా అభ్యర్థుల తనిఖీల కోసం ప్రతి కేంద్రంలో మహిళా కానిస్టేబుళ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# రాజీవ్ రహదారి సమస్యలు పరిష్కరించండి



- నూతన హైవేను ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రికి విన్నవించిన బిజెపి నాయకులు

**మంచిర్యాల, జూన్ 6 (మనం ప్రతినిధి)** మంచిర్యాల - హైదరాబాద్ మధ్య ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారి వల్ల ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని నూతనంగా మంచిర్యాల - హైదరాబాద్ మధ్య కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి చొరవ చూపాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి కి శనివారం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి వినతి పత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదిస్తున్న నాగ్ పూర్- హైదరాబాద్ గ్రీన్ ఫీల్ హైవే ను చంద్రపూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, సిద్దిపేట మీదుగా హైదరాబాద్ వరకు నిర్మించే విధంగా ఉన్న అవకాశాలను పరశీలించాలి అని కోరారు. పెండింగ్ లో ఉన్న ఇతర రహదారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో బిజెపి నాయకులు బేర సత్యనారాయణ తదితరులు ఉన్నారు.


# చెత్త సేకరణ పేరిట ప్రజలపై అదనపు భారం వద్దు



- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి
- గజ్వేల్ బీజేపీ నాయకులు

**గజ్వేల్, జూన్ 5 మనం న్యూస్:** చెత్త సేకరణ పేరిట ప్రజలపై అదనపు భారం వద్దని, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని గజ్వేల్ బీజేపీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ లు డిమాండ్ చేశారు.మున్సిపల్ లో ఇప్పటికే పన్నులు, నల్లా బిల్లులు, ఇతర సేవల ఛార్జీలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై చెత్త సేకరణ పేరుతో మరో భారం మోపడం అన్యాయమని గాడిపల్లి భాస్కర్, దేవులపల్లి మనోహర్ యాదవ్ విమర్శించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ బాధ్యతలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన మున్సిపల్ శాఖ, ప్రైవేటీకరణ పేరుతో అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదన్నారు. మున్సిపల్ పరిధిలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తూప్రాన్ రోడ్డులో ఉన్న కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ భూములను పరిరక్షించి స్వాధీనం చేసుకోవాలని, ప్రజ్ఞాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో స్మశానవాటిక ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా చెత్త సేకరణ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని ప్రజలపై అదనపు భారం పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, బిజెపి సీనియర్ నాయకులు పేర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు నాయిని సందీప్ కుమార్,మడుగురి నరసింహ ముదిరాజ్, బిజెపి సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకట్ రెడ్డి, బిజెపి నాయకులు మహిపాల్ రెడ్డి, నాగు ముదిరాజ్, మంద వెంకట్, పిట్ల శ్రీనివాస్, కోశాధికారి హరి కుమార్,జోడు ప్రకాశ్,కొమ్ము చంద్రశేఖర్, కేతవత్ ఆంజనేయులు, కాళ్ళ సాయికుమార్, సందిరి రాజు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు తప్పిన ప్రమాదం



- బస్వాపూర్ వద్ద కారును ఢీకొట్టిన లారీ

**బిక్కనూర్, జూన్ 6 ( మనం న్యూస్ ):** నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తకు త్రుటిలో ఒక పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం ఆయన ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ఒక లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఘటన వివరాల లోకి వెళ్తే స్థానిక వివరాల ప్రకారం., మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త హైదరాబాద్ నుండి నిజామాబాద్ వైపు తన కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో బిక్కనూర్ మండలంలోని బస్వాపూర్ గ్రామ శివారుకు చేరుకోగానే, వెనుక నుండి అతివేగంగా వచ్చిన ఒక లారీ ఆయన కారును బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కారు కొంతమేర దెబ్బతిన్నప్పటికీ, అదృష్టవశాత్తు కారులో ఉన్న మాజీ ఎమ్మెల్యేతో పాటు ఇతరులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న బిక్కనూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు.గణేష్ గుప్తను పరామర్శించి, ఆయన క్షేమంగా ఉన్నారని నిర్ధారించుకున్నాక ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం నాయకులు ఆయన కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, వేరే కారులో సురక్షితంగా నిజామాబాద్కు పంపించివేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# జాతీయ లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి



- పోలీస్ కమిషనర్

**నిజామాబాద్, జూన్ 6 (మనం బ్యూరో):** జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 20న నిర్వహించినట్లు పత్రిక ప్రకటన ద్వారా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య కోరారు. ట్రాఫిక్ చలానాలు, చిన్నపాటి క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కోర్టుల్లో పెండింగ్లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవడంతో పాటు సమయం, ఖర్చు ఆదా చేసుకోవచ్చని తెలిపారు. పరస్పర రాజీ ద్వారా సమస్యలకు శాంతియుత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. 'రాజీ మార్గమే - రాజ మార్గం' అనే నినాదంతో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్లో పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతగా పూర్తి చేయాలి



- అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

**జగిత్యాల, జూన్ 06 (మనం ప్రతినిధి):** ప్రజాపాలన - ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో జగిత్యాల డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచ్ తో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

అలాగే గ్రామ పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు మరియు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ వార్డుల్లో వార్డు సభలు

**ఎల్లారెడ్డి, జూన్ 6 (మనం న్యూస్):** ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో శనివారంతెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 4, 5 మరియు 6 వార్డులలో వార్డు సభలు నిర్వహించారు. వార్డుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు మరియు ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించి, ప్రజల నుండి సూచనలు మరియు వినతులు స్వీకరించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, వార్డుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ జె జగ్జీవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ, ఆరోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు మరియు వార్డు కౌన్సిలర్స్ ప్రజలు పాల్గొన్నారు.



# దోస్త్ ఆన్లైన్ అడ్మిషన్లుమూడో విడతకు చివరి తేదీ జూన్ 15

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహాదేవపూర్ ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్



**మహాదేవపూర్,జూన్ 06మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోనిప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహాదేవపూర్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సులలోప్రవేశాలకోసందోస్త్ఆన్లైన్ అడ్మిషన్ల మూడో విడత కొనసాగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ ఒకప్రకటనలోతెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్నిసద్వినియోగంచేసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందాలని ఆయన సూచించారు. కళాశాలలో బి.ఏ.బి.కాంకంప్యూటర్ అప్లికేషన్స్, బి.ఎస్సిబీజెడ్సి, బి.ఎస్సిఎంపీసీఎస్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైనవిద్య, ఆధునిక బోధనాపద్ధతులు, కెరీర్ మార్గదర్శకత్వం మరియుపోటీ పరీక్షల కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించబడుతున్నాయనిపేర్కొన్నారు. మహాదేవపూర్, పలమేల ,కాటారం, మహాముత్తారం, మల్హర్రావు తదితర మండలాలకు చెందిన విద్యార్థులు దోస్త్ వెబ్సైట్ ద్వారా లేదా కళాశాలలోని దోస్త్ హెల్ప్ డెస్క్ సహాయంతో ఆన్లైన్లో అడ్మిషన్లు పొందవచ్చునితెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, సమృద్ధిగా పుస్తకాలతో కూడిన గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, విశాలమైన ఆటస్థలం, పచ్చదనంతో కూడిన ప్రశాంతమైన విద్యా వాతావరణం విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయనిపేర్కొన్నారు. అదనంగా విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్ఎస్ఎస్, పర్యావరణమరియు అవగాహన కార్యక్రమాలు క్రమంతప్పకుండా నిర్వహించబడుతున్నాయని తెలిపారు.

దోస్త్ఆన్లైన్ అడ్మిషన్ల మూడోవిడతకు దరఖాస్తుచేసుకునే చివరి తేదీ 15-06-2026 అనితెలిపారు.

# ట్రిబుల్ ఐటీ ప్రవేశాలకు ఎంపికైన విద్యార్థులు



**మహాదేవపూర్ జూన్ 06మనం న్యూస్:** మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఈ విద్యా సంవత్సరం (2026-27) ట్రిబుల్ ఐటీ ప్రవేశాల్లో జిల్లాలోనే అత్యధికంగా నలుగురువిద్యార్థులుమహదేవ్పూర్ బాలికల పాఠశాల నుండి అర్హత సాధించినటు పాఠశాలప్రధానోధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు కుమారి గరిటెరితిక, మహ్మద్ రిమ్ష , మోటం అక్షిట్, ట్రిబుల్ ఐటీ బాసరకు ఎంపికయ్యారు. మరియు మట్టి పావని ట్రిపుల్ ఐటి మహబూనాగర్ కి ఎంపిక కావడం జరిగిందిఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, గ్రామసర్పంచ్ శ్రీమతి హసీనాబాను, పాఠశాలప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డిమరియు ఉపాధ్యాయ బృందం సరిత, మడకమధు, సుధారాణిసరితాదేవి హోలీ పాషా శ్రీనివాస్ వసుదప్రియ వీరేశం సమ్మయ్యలీలారాణిరజిత సాహిదా బేగం ప్రసూన దీపిక పూర్ణిమ ఆంజనేయులు అజ్మత్ పాషాతదితరులుఅభినందించారు

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన



**జగిత్యాల జూన్ 06(మనం న్యూస్)** ధ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు పోలాస గ్రామం మరియు జగిత్యాల పట్టణ బస్టాండ్ ప్రాంతంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా భరోసా కేంద్రం అందిస్తున్న సేవలు, పోక్సో చట్టం, అత్యాచార నిరోధక చట్టాలు, సైబర్ స్టాకింగ్, సైబర్ నేరాలు, బాల్య వివాహాల నిషేధ చట్టం, మహిళలు మరియు చిన్నారుల రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అలాగే 100, 1098, 1930, 181 హెల్ప్లైన్ నంబర్ల వినియోగం, లింగ సమానత్వం, లింగ సున్నితత్వం, పోక్సో చట్టం కింద నేరాలకు విధించే శిక్షల గురించి వివరించారు.ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

# ప్రభుత్వ భూమి వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం

- పోలీసులను మోహరించి రోడ్డు నిర్మాణ పనులు
- వినతులకు స్పందించని యంత్రాంగం
- మీడియా సమావేశంలో సిపిఐ నేత, రైతు మహ్మద్ మౌలానా



**ఖమ్మం, జూన్ 6(మనం న్యూస్):** ప్రభుత్వ భూమిని వదిలి పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఏడు తరాలుగా ఈ భూమి మా ఆధీనంలో ఉందని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ముత్తగూడెంకు చెందిన మహ్మద్ మౌలానా తెలిపారు. అనేక సార్లు విజ్ఞప్తులు చేసినా, న్యాయస్థానాల తీర్పులను సైతం అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. -శనివారం ఖమ్మం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహ్మద్ మౌలానా మాట్లాడుతూ ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 64లో తమకు 6.36 ఎకరాలు, సర్వే నెం66లో 3.03 ఎకరాల భూమి ఉందని ఈ భూమిని ఇప్పటికి మేము ఏడు తరాలుగా అనుభవిస్తున్నామని ఆయన తెలిపారు. గతంలో రాజకీయ కక్షల నేపథ్యంలో తాను జైలులో ఉన్నప్పుడు ప్రభుత్వ డొంకను వదిలి తన భూమిలో రోడ్డు నిర్మాణం చేశారని అప్పుడు జిల్లా పరిషత్ పరిధిలో ఉన్న రోడ్డు ఆ తర్వాత ఆర్అండ్బి పరిధిలోకి వచ్చిందన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అందరికీ వినతి పత్రాలు సమర్పిస్తూ న్యాయస్థానాలను సైతం ఆశ్రయించామన్నారు. ఇటీవల ఆర్డీవో సమక్షంలో ఇంజనీరింగ్ అధికారులు తనను పిలిపించి భూ వివరాలు అడిగారని తనకు కలిగిన పట్టా భూమిని వదిలి రోడ్డు నిర్మాణం చేసుకోవాలని విజ్ఞప్తి చేశామన్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా ఉంటే తనకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా గతంలో ఉన్న డొంకను పక్కనే ఉన్న ఎన్నెస్పి మేజర్ కాలువను సర్వే చేయకుండా శుక్రవారం అర్ధరాత్రి 50 నుంచి 60 మంది పోలీసులు 40 వాహనాల్లో వచ్చి బలవంతంగా నా భూమిలో రోడ్డు పోసేందుకు ప్రయత్నించారన్నారు. అడ్డుకుంటే బలవంతంగా పోలీస్ స్టేషన్కు తరలించారన్నారు. కాంట్రాక్టర్ మనుషులు, పోలీసులు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మకై తన పట్టా భూమిలో రోడ్డు నిర్మిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దౌర్జన్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తాను అభివృద్ధికి వ్యతిరేకం కాదని ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణం చేసుకుంటే తనకు అభ్యంతరం లేదని అవసరమై -తన పట్టా భూమిని తీసుకున్నా సర్వే చేసి ఎంత భూమి పోతుందో దానికి పరిహారం చెల్లించాలని మౌలానా డిమాండ్ చేశారు. రోడ్డు పక్కనే ప్రభుత్వ భూమి ఎన్నెస్పి స్థలం కలిపి 70 అడుగుల వెడల్పున ఉందని రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఆటంకం లేదని కానీ కక్షపూరితంగా తన భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారన్నారు. న్యాయస్థానం తీర్పులను, రెవెన్యూ నిబంధనలను, భూసేకరణ చట్టాని అపహాస్యం చేస్తూ దౌర్జన్యంగా పోలీసులతో బెదిరించి భయపెట్టడం ద్వారా తన భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తన పట్టా భూమిలో నుంచి రోడ్డు నిర్మాణం జరగనివ్వబోమని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. న్యాయ పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్ కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, -ఏఐవైఎఫ్ నాయకులు మహ్మద్ గౌస్పాషా, స్థానికులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్



**దుగ్గొండి, జూన్ 06 (మనం న్యూస్):** ఎస్ఐఆర్ సర్వే ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటికి చేరుకుని అర్హుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. దుగ్గొండి మండల కేంద్రంలో శనివారం క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే ప్రక్రియను ఆమె స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె, నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని సూచించారు. ప్రజల సహకారంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, తహసీల్దార్ సమ్మక్క, జీపీవో రమేష్, బీఎల్వోలు శ్రీదేవి, సరళ, సునీత మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ ఆధ్వర్యంలో పలు కోర్సులలో శిక్షణ

- ఐటీడీఏ పీవో టొప్పొ



**బూర్గుపేట,జూన్ 6మనం ప్రతినిధి :** బూర్గుపేట గ్రామం వెంకటాపూర్ మండల్ ములుగు జిల్లా లో మరియు గుర్రంపేట గ్రామం భూపాలపల్లి మండలం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ పాల్గొని మాట్లాడుతూ ఐటీడీఏ ఏటూరునాగారం గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐదు సెంటర్ల ద్వారా వివిధ శిక్షణ సంస్థల ద్వారా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా కోర్సుల గురించి తెలియజేసినారు. యూత్ ట్రైనింగ్ సెంటర్ ఏటునాగారం నందు టైలరింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ టెలికాలర్, హ్యాండ్ ఎంబ్రాయిడర్ కోర్సులు అందుబాటులో ఉన్నవని ములుగు నందు బ్యూటిషన్ , కంప్యూటర్స్ వై టి సి కాటారం నందు ఫుడ్ అండ్ బేవరేజ్ ఫ్రంట్ ఆఫీస్ సోలార్ టెక్నీషియన్ రిటైల్ కోర్సులు కలవని వై టి సి వరంగల్ నందు జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ వేర్హౌస్ అసోసియేట్ వేర్ హౌస్ సూపర్వైజర్ కోర్సులు కలవని, పీఎంహెచ్ మహబూబాబాద్ నందు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ ఏసి టెక్నీషియన్ ఫైబర్ టెక్నీషియన్ కోర్సులు వివిధ సెంటర్లలో నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ తెలిపారు. ఈ కోర్సులను గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు అందరూ వినియోగించుకోగలరని పేర్కొన్నారు.

# బీఎల్ఏలకు శిక్షణ: 'ఓటు చోరీ'పై అప్రమత్తంగా ఉండాలి

- డిసిసి ధన్వంతి
- ఓటు హక్కు పరిరక్షణ ప్రతి కార్యకర్త బాధ్యత
- కడియం శ్రీహరి అధ్యక్షతన సదస్సు



**జనగామ, జూన్ 6( మనం ప్రతినిధి):** మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు బీఎల్ఏల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిసి ధన్వంతి మాట్లాడుతూ, దేశంలో జరుగుతున్న 'ఓటు చోరీ' అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆధారాలతో నిరూపించిన ఈ అవినీతిపై ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు పౌరుడి విలువైన హక్కు అని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఆఔఅపై ఉందన్నారు. ఓటర్ జాబితాల్లో అనుమానాస్పద మార్పులు, అక్రమ చేర్పులు, తొలగింపులపై ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు కడియం కావ్య ముందుగానే ఆఔఅలకు అవగాహన కల్పిస్తూ ఫారం-6, ఫారం-7, ఫారం-8 వినియోగంపై బుక్లెట్ రూపొందించడం అభినందనీయమని ఆమె కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి నిజమైన ఓటు రక్షించేలా పారదర్శక ఎన్నికల కోసం ఆఔఅలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ట్రైనర్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు దుద్దిల్ల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, జంగా రాఘవరెడ్డి, మారుజోడు రాంబాబుతో పాటు పలువురు నాయకులు, ఆఔఅలు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

# ఇక నడవలేననుకున్నాడు..నడిపించి చూపించారు'మెడికవర్' వైద్యులు

- 75 ఏళ్ల వృద్ధుడికి మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స సక్సెస్
- వివరాలను వెల్లడించిన ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శశివర్ధన్




**పటాన్ చెరు, జూన్ 6 (మనం న్యూస్):** మంచానికే పరిమితమైన ఇక నడవలేననుకున్నా 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సతో 75 ఏళ్ల వృద్ధుడిని మళ్లీ నడిపించారు మెడికవర్ వైద్యులు..వయసు పెరిగిందంటే నడవడం కష్టమే, నొప్పితో జీవించాల్సిందే అనే అపోహలను చెరిపేస్తూ.. 75 ఏళ్ల వృద్ధుడికి రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు..ఆయనకు మళ్లీ స్వతంత్రంగా నడిచే ఆనందాన్ని అందించారు చందానగర్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ శశివర్ధన్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాఘవేంద్ర గత కొన్ని సంవత్సరాలుగా రెండు మోకాళ్లలో తీవ్రమైన ఆస్టియోఆర్థరైటిస్‌తో బాధపడుతున్నారు. పరిస్థితి క్రమంగా విషమించడంతో నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీ నుంచి లేవడం వంటి సాధారణ పనులు కూడా తీవ్ర నొప్పితో కూడినవిగా మారాయి. వయసు అధికంగా ఉండటం, థైరాయిడ్ సమస్యతో పాటు గతంలో స్ట్రోక్ రావడం వల్ల శస్త్రచికిత్స చేయించుకోవడానికి ఆయన వెనుకంజ వేశారు. అయితే సమగ్ర వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిస్థితుల సమన్వయంతో మెడికవర్ హాస్పిటల్స్ చందానగర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.శశివర్ధన్ నేతృత్వంలోని బృందం రెండు మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. శస్త్రచికిత్స అనంతరం మొదటి రోజే రాఘవేంద్రను నిలబెట్టి పూర్తి బరువుతో నడిపించారు. ప్రత్యేక ఫిజియోథెరపీ, పునరావాస చికిత్సతో ఆయన కోలుకునే ప్రక్రియ వేగంగా సాగింది. కేవలం నెల రోజుల్లోనే ఎలాంటి సహాయక పరికరం లేకుండా స్వయంగా నడిచే స్థితికి చేరుకుని తన రోజు వారీ కార్యకలాపాలను స్వతంత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తనకు అందిన కొత్త జీవితానికి కృతజ్ఞతగా, కోలుకునే సమయంలో ఉపయోగించిన వాకర్ను మరొక రోగికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో ఆసుపత్రికి విరాళంగా అందించడం అందరినీ భావోద్వేగానికి గురి చేసింది. ఈ సందర్భంగా డా. శశివర్ధన్ మాట్లాడుతూ..వయసు ఎక్కువైందనే కారణంతో చాలా మంది మోకాళ్ల నొప్పిని భరిస్తూ జీవిస్తున్నారని తెలిపారు. ఆధునిక జాయింట్ రీప్లేస్మెంట్ టెక్నాలజీ, మెరుగైన నొప్పి నియంత్రణ విధానాలు, త్వరితగతిన నడక ప్రారంభించే ప్రోటోకాల్స్, వ్యక్తిగత పునరావాస చికిత్సల వల్ల వృద్ధాప్యంలో కూడా అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. తీవ్రమైన మోకాళ్ల నొప్పిని వయసు సహజ లక్షణంగా భావించకుండా సరైన సమయంలో ఆర్థోపెడిక్ నిపుణులను సంప్రదించడం ఎంతో ముఖ్యం అని తెలిపారు. 75 ఏళ్ల వయసులో మళ్లీ స్వేచ్ఛగా నడుస్తూ సాధారణ జీవితాన్ని ఆస్వాదిస్తున్న రాఘవేంద్ర కథ, వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, సరైన వైద్యం ద్వారా నొప్పిలేని జీవితం తిరిగి పొందవచ్చని నిరూపిస్తోందని డాక్టర్ శశివర్ధన్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సెంటర్ హెడ్ మల్లేశ్ పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ



- కానూరి వెంకన్న మృతి బాధకరం

**మంగపేట,జూన్ 6మనం ప్రతినిధి :** మండలంలోని రాజుపేట గ్రామానికి చెందిన కానూరి వెంకన్న (టైలర్ ) ఇటీవల అనారోగ్యంతో భాధపడుతూ మృతి చెందగా శనివారం వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి ప్రగాఢ సానుభూతి తెలిపి 13,500 సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కర్రీ నాగేంద్రబాబు, బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి తుమ్మూరి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ చందర్లపాటి శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు పొట్రూ సమ్మయ్య, మండల యస్సి సెల్ అధ్యక్షులు పళ్ళికొండ యాదగిరి,బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు వీర్ల జయకృష్ణ, బాధ విరారెడ్డి, చదలువాడ సత్యానారాయణ పాల్గొన్నారు.

# గ్రామసభ నిర్వహించిన సర్పంచ్ రజిత



**మల్హర్, జూన్ 6. మనం. న్యూస్:** మండలంలోని వల్లెంకుంట గ్రామపంచాయ నందు గ్రామసభ నిర్వహించడంజరిగింది గ్రామసభలకు సర్పంచ్. బొమ్మ రజిత అధ్యక్షులుగాపాల్గొనడంజరిగిం సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామపంచాయతీలలో తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ప్రతిరోజు పారిశుద్ధ్యం నిర్వహించాలని, అదేవిధంగా కాలువల పూడికతీత మరియు ముళ్ళ పొదల తొలగింపు మరియు వీధి దీపాలలో చెడిపోయిన బల్బులను తొలగించి నూతన బల్బులను ఏర్పాటు చేయాలని గ్రామంలో అందరికీ త్రాగునీటిసౌకర్యం కల్పించాలని సర్పంచ్ తెలపడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉప సర్పంచ్ కటకం సప్న గ్రామ కార్యదర్శి డైరెక్టర్ గడ్డం పోచయ్య గ్రామపంచాయతీ పాలకవర్గం మరియు ప్రధానోపాధ్యాయులు ప్రజలు మరియు గ్రామపంచాయతీ సిబ్బదితో పాటు తదితరులుపాల్గొన్నారు

# గ్రామాభివృద్ధి సమస్యల పరిష్కారానికి గ్రామసభలే ప్రధాన వేదిక

- లాభదాయక పంటల సాగుతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించాలి
- గ్రామసభలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 06 (మనం బ్యూరో):** గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక, అమలు, ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రామసభలు కీలక వేదికలుగా నిలుస్తాయని ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని , నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని బల్మూరు మండలం జినుకుంట గ్రామంలో గ్రామ సర్పంచ్ పుష్పలత అధ్యక్షతన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనపై గ్రామసభలో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....., గ్రామసభల ద్వారా ప్రజలు తమ అవసరాలు, సమస్యలు, అభివృద్ధి సూచనలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రజల చురుకైన భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామస్థాయిలో రూపొందించే ప్రణాళికలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని పేర్కొన్న కలెక్టర్, రైతులు సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్లో డిమాండ్ ఉన్న లాభదాయక పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో వరి పంట సాగు ఎక్కువగా జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేలా జిల్లాలో ఇతర ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చని తెలిపారు. పంటల ఎంపికలో మార్కెట్ అవకాశాలు, సాగు వ్యయం, నీటి లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, రాగి, చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, ఇతర లాభదాయక పంటలను ఈ సంవత్సరం నుండి మొదలుపెట్టాలని కలెక్టర్ రైతులను కోరారు. నీటి వనరులను దృష్టిలో ఉంచుకొని నేపథ్యంలో ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవడంతో పాటు వర్షపు నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు ఇచ్చే పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్య, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, వ్యవసాయం వంటి రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఈ నెల లో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో కొనసాగనున్న సర్ యస్ ఐ అర్ ద్వారా నిర్వహించే కార్యక్రమానికి సంబంధించిన అర్హులైన ఏ ఒక్క ఓటు తొలగిపోకుండా, అనరుహులైన ఓట్లు ఏ ఒక్కటి ఓటర్ జాబితాలో ఉండకుండా గ్రామస్తులు చూసుకోవాలని సర్ కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. నీటి వినియోగం, వర్షపు నీటిని భూగర్భ జలాలు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రతిజ్ఞను గ్రామసభలు కలెక్టర్ గ్రామస్తులు చేశారు. అనంతరం గ్రామసభలో పాల్గొన్న ప్రజల నుంచి పలు వినతులు స్వీకరించిన కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులకు సమస్యల పరిష్కారంపై తగిన ఆదేశాలు జారీ చేశారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఓ శ్రీరాములు, డిప్యూటీ సర్పంచ్ పార్వతమ్మ, ఎమ్మార్వో శ్రీకాంత్, ఎంపీడీవో జె.రాఘవులు, ఎంఈఓ గజేంద్ర శ్రీనివాస్, ఎంపీఓ నర్సిరెడ్డి, సిడిపిఓ దమయంతి, పంచాయతీ సెక్రెటరీ నిరంజన్, గ్రామ పాలన అధికారి విజయ్, అర్ ఐ శివరామకృష్ణ, గ్రామ ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రభుత్వ పాఠశాల పునప్రారంభం లోపు యూనిఫామ్స్ సిద్ధం చేయాలి





**ఖమ్మం, జూన్ 06(మనం బ్యూరో):** నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టి అన్ని జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నీట్ పరీక్ష నిర్వహణ, ప్రభుత్వ పాఠశాల పున:ప్రారంభానికి యూనిఫామ్స్ తయారీ, వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం, ధాన్యం కొనుగోలు పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా, ఖమ్మం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విద్యార్థులకు తాగునీరు, బెంచీలు, బల్లలు, కుర్చీలు, మూత్రశాలల సౌకర్యం వంటి అన్ని మౌళిక సదుపాయాలను సమకూర్చాలన్నారు. పోలీస్ ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనంలో నిర్దేశించిన రూట్ లో మాత్రమే పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలనీ, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స కిట్ లు అందుబాటులో ఉండాలని, పరీక్ష రాసే విద్యార్థుల గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, ప్రతి విద్యార్థిని నిశితంగా పరిశీలించిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని పేర్కొన్నారు. ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని సూచించారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు.ఈ సమావేశంలో డిఈఓ చైతన్యజైనీ, డిఎంహెచ్ఓ రామారావు, ఆర్టీసీ డీఎం, వివిధ శాఖల సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ములుగును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన
- మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 6, మనం ప్రతినిధి:** ములుగును ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని, పర్యాటక కేంద్రాలకు దీటుగా ములుగు పట్టణ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం ములుగు పట్టణంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్ఆర్ 2025-26 నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ములుగు పట్టణ పరిధిలో జాతీయ రహదారి-163 నుండి ఎరుకలవాడ వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, జాతీయ రహదారి-163 నుండి ఎస్సీ కాలనీ వరకు రూ.5 కోట్ల 75 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు, అలాగే ములుగు పట్టణ తూర్పు ప్రాంతంలో రూ.5 కోట్ల 95 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ములుగు మున్సిపాలిటీ పరిధిలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ, ములుగు మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణాన్ని మరింత సుందరంగా, ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ములుగు పట్టణాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన మున్సిపల్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రామప్ప, జంగాలపల్లి, మేడారం ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన జంక్షన్ల తరహాలో గట్టమ్మ జంక్షన్తో పాటు ములుగు బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు, ఎంఆర్ఓ కార్యాలయం, కలెక్టరేట్ ఎదురుభాగం వంటి కీలక ప్రాంతాల్లో జంక్షన్ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రింగ్ రోడ్ నిర్మాణ ప్రతిపాదనపై పరిశీలన జరుగుతోందని, కలెక్టరేట్, యూనివర్సిటీ, దేవగిరిపట్నం ప్రాంతాలను అనుసంధానించే రింగ్ రోడ్ మార్గాలపై పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి అనుకూలమైన మార్గాన్ని ఎంపిక చేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు, గృహాలకు నష్టం కలగకుండా రహదారి అభివృద్ధి చేపట్టడం ద్వారా పట్టణంలో భారీ వాహనాల రద్దీని తగ్గించడంతో పాటు ప్రత్యేక సందర్భాల్లో ట్రాఫిక్ మళ్లింపులకు కూడా సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, నాణ్యతతో సకాలంలో పూర్తి అయ్యేలా సహకరించాలని కోరారు.

ములుగు జిల్లా పర్యాటక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని పట్టణాన్ని ఆధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ సంపత్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహీన్, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్లైన్లోనే..

**జీపీఓలు, ఆర్ఐలకు అవగాహన కల్పించిన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు**



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 06 (మనంప్రతినిధి):** మీసేవ ద్వారా అందిస్తున్న వివిధ ధృవపత్రాల జారీ ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విధానాలపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు అవగాహన కల్పించారు. చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో ఆయా మండలాల జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులతో సమావేశం నిర్వహించి మీసేవ దరఖాస్తుల పరిశీలన, ధృవపత్రాల జారీ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకునే ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవల దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్లైన్లోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు అప్లోడ్ చేసిన పత్రాలను మాత్రమే జీపీఓలు, ఆర్ఐలు పరిశీలించి అర్హత మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన జి పి ఓ, ఎం ఆర్ ఐ వెరిఫికేషన్ మొబైల్ అప్లికేషన్ వినియోగంపై అధికారులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేయరాదని తెలిపారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే ధృవపత్రాల జారీ అనంతరం సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. మీసేవ సేవలకు సంబంధించిన సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైనప్పుడు మండల స్థాయి జీపీఓ, ఆర్ఐ లేదా తహసీల్దార్ను సంప్రదించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం,గ్రామాల సమగ్రాభివృద్దే లక్ష్యం

## రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**లక్ష్మీదేవిపల్లి జూన్ 06 (మనంన్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారం,గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మార్చి 6వ తేదీ నుండి అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలు చేయబడుతోందని తెలిపారు. గ్రామ సభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని అన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని



తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పంటల దిగుబడులు పెరిగేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐఆర్ను సమర్థవంతంగా అమలు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను జాబితా నుండి తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, గ్రామంలోని విద్యుత్ అదనపు లైన్లు , అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి కి ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, మాలోత్ భారతి, ఎంపీడీఓ, జి.సుస్మిత మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం

- **ఎమ్మెల్యే జారె ఆదినారాయణ**

**దమ్మపేట, జూన్ 06 (మనం న్యూస్) :** గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అశ్వారావుపేట ఎంఎల్ఏ జారె ఆదినారాయణ పేర్కొన్నారు. దమ్మపేట మండలం లింగాలపల్లి, జమేదార్ బంజర, దమ్మపేట గ్రామపంచాయతీ కార్యాల యాలలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ముఖ్య అంశాలపై గ్రామస్థులతో ప్రత్యక్షంగా చర్చించి వారి సమస్యలు, సూచనలు అవసరాలను తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, వర్షాకాల సన్నద్ధత, ఘనవ్యర్థాల నిర్వహణ, జలసంరక్షణ, మొక్కల పెంపకం, వనసంరక్షణ, ఓటర్లజాబితా ప్రత్యేక సమగ్ర



సవరణ, వరదలు, విపత్తుల నిర్వహణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో తలెత్తుతున్న సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు పరిపాలనా అనుమతులు సాధించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి గ్రామసభను ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామసభలు కేవలం సమావేశాలు కాకుండా గ్రామాల భవిష్యత్ అభివృద్ధికి మార్గదర్శక వేదికలుగా నిలవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్ రెడ్డి,స్థానిక సర్పంచ్ పగడాల రమాదేవి, ఈశ్వరప్రగడ నాగభూషణం, ఉప సర్పంచ్ ఆంగోత్ శ్రీనివాసరావు, టౌన్ అధ్యక్షులు చిన్నశెట్టి చిట్టిబాబు,ఎలక్ట్రికల్ ఏఈ రవికిరణ్,ఇరిగేషన్ ఏఈ కృష్ణ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సురేంద్ర, అగ్రికల్చర్ ఏఓ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ ఏఈ జుంకీలాల్ వార్డుసభ్యులు ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు గ్రామ పెద్దలు మహిళలు యువత గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీ

**కొత్తగూడెం సింగరేణి, జూన్6(మనం న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవంను పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా వ్యాస రచన వక్తృత్వ క్విజ్ పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించి ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థినీ విధ్యార్థులతో జూనియర్ కళాశాల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినీలతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయ పర్యావరణ సహాయ ఇంజనీర్ అజయ్ కుమార్, సింగరేణి కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ బి.సైదులు, సి.హెచ్. శ్రీనివాస్ (ఎస్ఓఎం), పి.రవి కిరణ్(అడిషనల్ మేనేజర్), మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శారద, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, సింగరేణి ఉన్నత పాఠశాల పర్యావరణ సమన్వయకర్త వనిత, ఇతర అధికారులు, సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పండుటాకుల ఎదురుచూపు

## కొత్త పెన్షన్లపై అయోమయం

### ఇంకెన్ని రోజులు ఎదురుచూడాలంటూ ప్రజల ఆవేదన




**కొత్తగూడెం టౌన్, జూన్ 06 (మనంన్యూస్):** ప్రభుత్వం మారినంక కొత్త పింఛన్లు వస్తాయి... దానికి తోడు పింఛన్లు కూడా పెంచి ఇస్తానన్నారు. ఇక ఈ ముసలితనంలో ఇబ్బందులు ఉండవని భావించి ఆశతో ఎదురుచూస్తున్న పండుటాకులకు నిరాశ ఎదురవుతోంది. అధికారులు దరఖాస్తులు తీసుకుంటున్నారు కానీ కొత్త పింఛన్లు ఇస్తలేరు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకెన్ని రోజులు పింఛన్ల కోసం ఎదురు చూడాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఐదారు సార్లు దరఖాస్తులు చేసుకున్నామని, ఇక కొత్త పింఛన్లు పై ఆశ వదులుకోవాల్సిందేనా అంటూ ఆవేదన చెందుతున్నారు. స్వయాన ముఖ్యమంత్రి సాబ్ హామీ ఇచ్చినా కానీ అవి దరఖాస్తుల వరకే పరిమితం అవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.

**పండుటాకుల ఎదురుచూపు...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కొత్త పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి నుంచి కొత్త పెన్షన్ల అమలు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ, ఇంకా అనేక ప్రాంతాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రజల్లో గందరగోళం నెలకొంది. పెన్షన్ కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులు ప్రకటనలు వస్తున్నాయి కానీ అమలు ఎప్పుడు జరుగుతుంది? అని ప్రశ్నిస్తున్నారు. దరఖాస్తులు తీసుకుంటూనే ఉంటే పరిశీలన ఎప్పుడు పూర్తవుతుంది, అర్హుల జాబితా ఎప్పుడు ఖరారు అవుతుంది, కొత్త పెన్షన్లు ఎప్పటి నుంచి అందుతాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఇంకెన్ని రోజులు ఎదురుచూడాలంటూ ప్రజల ఆవేదన...**

ప్రజల అభిప్రాయం ప్రకారం, పెన్షన్ అనేది కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాదు, అనేక కుటుంబాలకు జీవనాధారం. అలాంటి కీలక అంశంలో ఆలస్యం జరగడం వల్ల పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోతున్నారు. ప్రకటనలు కాదు.. అమలు తేదీ చెప్పండి, అర్హుల ఎంపిక ఎప్పుడు పూర్తవుతుంది?, కొత్త పెన్షన్లు ఏ నెల నుంచి ఖాతాల్లో పడతాయి? అనే ప్రశ్నలు గ్రామాలు, పట్టణాల్లో వినిపిస్తున్నాయి. ప్రభుత్వం వెంటనే పూర్తి షెడ్యూల్ విడుదల చేసి, దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక, పెన్షన్ పంపిణీ తేదీలపై స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది లబ్ధిదారుల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# మొక్కలు నాటడమే కాదు సంరక్షించాలి

- **ప్రత్యేక అధికారి శ్రీనివాస్**
- **స్వచ్ఛభారత్ కార్యక్రమాలు విధిగా నిర్వహించాలి**
- **జగన్నాథపురం గ్రామపంచాయతీలో ప్రత్యేక గ్రామసభ**
- **బడిబాటపై విస్తృత అవగాహన**

**పాల్వంచ, జూన్ 6(మనం న్యూస్):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాదు - వాటి సంరక్షణకు పాటుపడాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామపంచాయతీలో శనివారం 99 డేస్, యాక్షన్ ప్లాన్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. గ్రామసభలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మాన్సూన్ సన్నద్ధత, ఘన వ్యర్థాల నిర్వహణ, స్వచ్ భారత్ మిషన్ నిబంధనలు-2026, వ్యర్థాల తగ్గింపు, ప్లాస్టిక్ వినియోగ నివారణ, క్లాత్ బ్యాగ్స్ వినియోగం, జల సంరక్షణ, వృక్షారోపణ కార్యక్రమాలు, అలాగే బడిబాట కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పరిశుభ్రతను పాటించడం, ప్లాస్టిక్కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత వస్తువులను వినియోగించడం, వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుద్ధ్య చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పాఠశాల వయస్సు పిల్లలను తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని




కోరారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి జి శ్రీనివాస్, సర్పంచ్ అనిత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి శ్రీనివాసరావు, మండల పంచాయతీ అధికారి షేక్ షబానా, సిడిపిఓ ప్రసన్న లక్ష్మి, ఏవో శంభో శంకర్, ఏఈ విద్యుత్తు రవీందర్ , మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల క్షేత్రస్థాయి సిబ్బంది, సర్పంచ్ అనిత, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

## ప్రజల ప్రాణ రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 06 (మనంప్రతినిధి):** రానున్న వర్షాకాలం గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్లు, నాటుపడవలు, లైఫ్ జాకెట్లు, తాడులు, టార్చ్లైట్లు, హ్యాండ్ మైకులు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను ముంపు పరిస్థితులు ఏర్పడిన తర్వాత కాకుండా ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గోదావరి నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వరద పరిస్థితులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లను సేకరించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు, మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. 108 అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము కాటు, తేలు కాటు నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. పశువుల రక్షణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. 73 అడుగుల వరకు గోదావరి వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు



తీసుకుంటామని హెచ్చరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 10న పెరిగిన ధరలను నిరసిస్తూ కలెక్టరేట్ ముట్టడి

- **సిపిఐ నేత బాగం హేమంతరావు**

**ఖమ్మం, జూన్ 6(మనం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ సహా ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 10న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. పెరిగిన ధరలతో సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. సిపిఐ కార్యాలయంలో ఖమ్మం, వైరా, పాలేరు నియోజక వర్గాల సమావేశం శనివారం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ సంపన్నులు, కార్పొరేట్ల సేవలో ఉన్న మోడీ ప్రభుత్వం ప్రజలను పట్టించుకునే స్థితిలో లేదన్నారు. పదేళ్ల నాడు మోడీ అధికారాన్ని చేపట్టే ముందు రూ. 72 ఉన్న పెట్రోల్ ఇప్పుడు రూ. 115కు చేరుకుందని డీజిల్ సైతం రూ.55 నుంచి రూ. 108లకు చేరుకుందని ఆయన తెలిపారు. గ్యాస్ ధర రెండు రేట్లు పెరిగిందని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా రాబడి పెరగలేదని హేమంతరావు తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజలను ముఖ్యంగా సామాన్యులను విస్మరించి పాలన సాగిస్తుందని యావత్ దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచి పెడుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రజలకు అనేక హామీలను ఇచ్చిందని ఆ హామీలు నెరవేర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు.రెండున్నర ఏళ్లలో హామీల అమలులో వైఫల్యం చెందిన ప్రభుత్వం ఇకనైనా హామీల అమలుపై దృష్టిసారించాలని హేమంతరావు డిమాండ్ చేశారు.




మహిళలకు రూ.2,500 నెల వారి జమ, కళ్యాణ లక్ష్మి క్రింద తులం బంగారం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు వీటిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 24 లక్షల మంది పింఛన్ల కోసం దరఖాస్తు చేశారని జూన్ రెండు నాటికి రెండు లక్షల పింఛన్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం అది కూడా అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అరకొరగా ఇస్తున్న ప్రభుత్వం నివాస స్థలాల పంపిణీ గురించి మరిచిపోయిందన్నారు. స్థలాలు ఇస్తాం, ఇండ్లు ఇస్తామని చెప్పిన హామీని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తుందని అందుకే సిపిఐ ఆందోళన బాట పట్టిందన్నారు. రైతు భరోసా కూడా సరిగ్గా అమలు జరగడం లేదని రెండు ఎకరాల రైతులకు మాత్రమే రైతు భరోసా జమ చేశారని మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని హేమంతరావు ప్రశ్నించారు.మళ్లీ వానాకాలం సమీపిస్తుందని రైతు బంధు ఎప్పుడు జమ చేస్తారని ఆయన ప్రశ్నించారు. మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు చేసినా రైతులకు నెలలు గడిచినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరే భూములను వేలం వేయడం ద్వారా మాత్రమే ఆదాయం సమకూర్చుకోవాలని ప్రయత్నిస్తుందని హేమంతరావు ఆరోపించారు. ధరణిలోని లోపాలను భూభారతి సరి చేయలేదని భూ భారతి పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కుఅన్న చందంగా ఉందన్నారు. పింఛన్లను నాలుగు వేలకు పెంచాలని, అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ను ముట్టడించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్కె జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులుపాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి మంత్రి పొన్నం సహకారం



భీమదేవరపల్లి జూన్6 మనం న్యూస్ః గ్రామాల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారం అందిస్తున్నారని మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కేతిరి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రోజున గాంధీనగర్ గ్రామసభ సభలో వారు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో సిసి రోడ్లు, డ్రైనేజ్, తదితర అభివృద్ధి పనుల తో పాటు గాంధీనగర్ గ్రామంలో 30 లక్షల వేగంతో సిసి రోడ్లు 6 లక్షలతో పాఠశాల ప్రహరీ కూడా 2 లక్షలతో తాగునీటి సౌకర్యం, గ్రామ మహిళ ఐక్య సంఘ భవనం అంటే అభివృద్ధి పనుల మంజూరుకు మంత్రి పూర్తి సహకారం అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కు ప్రజలకు ,యువతకు, విద్యా వైద్యం అందం కోసం ప్రత్యేకమైన బస్సు సౌకర్యాన్ని మంత్రికల్పించడంతో గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుర్ర సమ్మయ్య, మహిళా సమైక్య సభ్యులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో షర్మిల



కరీంనగర్ జూన్ 6 మనం బ్యూరో)ః కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన షర్మిల శనివారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షర్మిల జిల్లా కలెక్టర్కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్తో చర్చించారు. కాగా, షర్మిల శనివారం కరీంనగర్ ఆర్డీవోగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అధికారుల

# బాధితులను పరామర్శించిన స్పీకర్



సంగారెడ్డి, జూన్ 06 మనం న్యూస్ ప్రతినిధి : వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో హోటల్ భవనం పైకప్పు కూలిన ఘటనలో గాయపడి సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయపడిన నలుగురు బాధితులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చందన (12), తండ్రి చాద్రు, రమేష్ (25), తండ్రి నరసింహులు లను స్పీకర్ పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, డిఎం అండ్ హెచ్ ఓ లలితా దేవి లను స్పీకర్ ఆదేశించారు. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించి, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.జ అనంతరం గోకుల్ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న ఎం. డి. నజీర్ (17) మరియు బాలాజీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎం. శివకుమార్ (25) లను స్పీకర్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకొని, మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యాలను, డి ఎం అండ్ హెచ్ ఓ ను కోరారు. ఈ సందర్భంగా బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన స్పీకర్,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా నిచ్చారు.

# నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు...



కరీంనగర్ జూన్ 6(మనం బ్యూరో)ః రాష్ట్రంలో నీట్-2026 పరీక్ష ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి అదనపు డి జి పి మహేష్ భగవత్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సి.పి.లు, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీట్-2026 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, వరి ధాన్యం కొనుగోలు, జూన్ 9న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి సభ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 21వ తేదీన జరగనున్న నీట్-2026 పరీక్షకు 24 పట్టణాలలో 208 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 72 వేల 956 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఇందుకు తగిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర, జిల్లా సమన్వయ కమిటీలు అందుకు అనుగుణంగా పని చేయాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై తక్షణమే స్పందించాలని, వదంతులు వ్యాప్తి కాకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వ సంస్థలలో మాత్రమే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, అంతర్జాతీయ యోగా దినోత్సవం దృష్ట్యా పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. పరీక్ష రోజున ప్రశ్న పత్రాల తరలింపు, అభ్యర్థుల రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, అభ్యర్థుల తనిఖీ, బందోబస్తు తదితర ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 71 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి 4 వేల 488 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు 10 లక్షల 58 వేల మంది రైతుల ఖాతాలలో 13 వేల 577 కోట్ల రూపాయల కనీస మద్దతు ధర జమ చేయడం జరిగిందని, మిగిలిన ధాన్యాన్ని కూడా త్వరితగతిన కొనుగోలు చేసి కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండల మహిళా సమాఖ్యకు 1 చొప్పున 553 బస్సులను మంజూరు చేయడం జరిగిందని, ఈ బస్సులను జూన్ 9వ తేదీన సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహిళా సమాఖ్య సభ్యులకు లాంఛనంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభకు మహిళా సమాఖ్య సభ్యుల తరలింపుపై ఆయా జిల్లాల గ్రామీణ అభివృద్ధి అధికారులు, ఆర్ టి సి రీజినల్ మేనేజర్లు సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని తెలిపారు. జూన్ 12న రాష్ట్రంలోని పాఠశాలల పునః ప్రారంభానికి విద్యార్థులకు అందజేయవలసిన యూనిఫామ్ లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.అదనపు డి జి పి మాట్లాడుతూ పరీక్షా కేంద్రాలలో సి సి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలకు ఎప్పటికప్పుడు స్పందించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా అభ్యర్థుల తనిఖీలో మహిళ కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగారావు డిఎం రజనీకాంత్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



- ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య

నల్లగొండ,జూన్ 6(మనం ప్రతినిధి)ః నల్లగొండ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ,పాఠశాలల ప్రారంభం దృష్ట్యా మరియు రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారీ వాహనాలు లారీలు,ట్రాక్టర్లు,రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి వాహనదారుడు కచ్చితంగా పాటించాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు భారీ వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు భారీ వాహనాలకు పట్టణ పరిధిలో అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు లైన్ డిసిప్లిన్ పాటిస్తూ, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపరాదని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, అనధికారిక పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సుల రద్దు, వాహనాల సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే దొంతి



దుగ్గొండి. జూన్ 06 (మనం న్యూస్): దుగ్గొండి మండలం మహ్మదాపురం,మర్రిపల్లి, మల్లంపల్లి, గుడిమహేశ్వరం గ్రామాలలో గ్రామ ఐక్య మహిళ సంఘాల భవనాలు,మల్లంపల్లి గ్రామంలో ఖిఇ కమ్యూనిటీ హాల్,మరియు గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి భూమి పూజ చేసిన నర్సంపేట శాసనసభ్యులు అనంతరం 99వ రోజు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి చెందడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతి మహిళను కోటీశ్వరాలను చేయాలని సంకల్పంతో ముందుకు పోతున్నామని ప్రతి మహిళా సంఘం కోటి రూపాయలతో వ్యాపారం చేయాలని తద్వారా గ్రామాలు అభివృద్ధి జరుగుతాయని ఈరోజు సమాజంలో ప్రతిదీ కలుషితమైపోయిందని కూరగాయలు పాలు నూనె వంటి నిత్యవసర సరుకులు విషపూరితంగా మారి వంద మందిలో 40 మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు సర్పంచులు గోగుల శ్రీనివాస్ రెడ్,డ్యాగం సుజాత సుధాకర్, బూర రాధిక హేమ్చందర్,కూరతోట స్వప్న సురేష్,వివిధ గ్రామ సర్పంచులు పొగాకు శోభారాణి వెంకటేశ్వర్లు, కన్నం హనీమ చిరంజీవి, వేముల ఇంద్రదేవ్ నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు చుక్క రమేష్ మండల మండల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి కిరణ్ రెడ్డి ఇంగోలి రాజేశ్వరరావు నర్సంపేట బ్లాక్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మినేని భరత్ రెడ్డి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రవివర్మ,ఉప సర్పంచులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు మండల నాయకులు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ధాన్యం సేకరణలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు

- ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షించాలి
- కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అందుబాటులో తప్పక ఉండాలి
- రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంది
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 06 (మనం బ్యూరో)ః నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి కొనుగోలు ప్రక్రియపై వారి అభిప్రాయాలను జిల్లా కలెక్టర్ తెలుసుకున్నారు. రైతులు తమ పంటను సులభంగా విక్రయించుకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. వరి తూకం, నాణ్యత పరీక్షలు, రికార్డుల నిర్వహణ, చెల్లింపుల ప్రక్రియను పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా రైతుల వద్ద నుంచి ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ధాన్యం తడిచిందా...? ఇంకా ఎంత ధాన్యం కాంటా వేయాలి...? కల్లాల్లో ఇంకా ఎంత ధాన్యం ఉంది...? అని కలెక్టర్ ఆరా తీశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం సేకరణను నిశితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతులు, పేద ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా, సత్వరంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. కేంద్ర నిర్వాహకులు, అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా అచ్చంపేట పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియాన్ని కలెక్టర్ పరిశీలించి, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్టేడియం వినియోగం, నిర్వహణ, అభివృద్ధి అవకాశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ముఖ్యంగా యువతకు క్రీడా సదుపాయాలు మరింత మెరుగ్గా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, అచ్చంపేట మున్సిపల్ కమిషనర్ మురళి, అచ్చంపేట తాహసిల్దార్ సైదులు, సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# చెరువును పట్టించుకోని అధికారులు

భీమదేవరపల్లి జూన్ 6 మనం న్యూస్: కొత్తకొండ చెరువు పట్టింపు లేక అధికారుల నిర్లక్ష్య వైనం ఇది.. గత ఏడాది క్రితం మొంత తుఫాన్ బీభత్సానికి వీరన్న చెరువు కట్ట తెగిపోయి 50 ఎకరాల రైతులకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేసిన సంబంధిత అధికారులు చూసిన పాపాన పోలేదని రాబోయే వర్షాకాలం వస్తున్నందున అధికారుల పట్టిక లేకపోవడం వల్ల స్థానికులు ఆశ్చర్యానికి ఆందోళనకు గురవుతున్నారు. కొత్తకొండ గ్రామ సర్పంచ్ సంబంధిత అధికారులను ఎన్నిసార్లు అధికారులు స్పందించకపోవడం గమనహర్హం. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వీరన్న చెరువు కట్టను పూడ్చి భవిష్యత్తులో రైతులకు తీవ్ర నష్టం జరగకుండా చూడాలని స్థానికులు కోరుకుంటుంటారు.



# పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం జరగకుండా వేగవంతం చేయాలి
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 06 (మనం బ్యూరో): జిల్లా వ్యాప్తంగా పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. అదేవిదంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ శనివారం ఉదయం అచ్చంపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని శానిటేషన్ పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. మొదటగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్, పనితీరు కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణ, పారిశుధ్య కార్మికుల పనితీరును పరిశీలించి స్థానిక ప్రజలతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. పట్టణం పరిశుభ్రంగా ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజ్ పనులను పరిశీలించిన కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం అచ్చంపేట పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పట్టణంలో పనుల నిర్మాణాల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధిదారులు త్వరగా ఇళ్లలోకి వెళ్లేలా వేగవంతంగా పనులను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, ఆసుపత్రి పరిశుభ్రత, మందుల వ్యాలిడిటీ తదితర అంశాలపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పాముకాటు, కుక్కకాటుల మందులతో పాటు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ దావఖానలో సేవలు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. వైద్యులు తప్పనిసరిగా ఆసుపత్రులకు సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ తో పాటు వైద్యులు, తదితరులు ఉన్నారు.

## ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత




- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి
- సంగారెడ్డి ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ నిర్వహణ

సంగారెడ్డి, జూన్ 06 మనం న్యూస్ ప్రతినిధిః ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత మరియు భద్రతను మరింత బలోపేతం చేయడంలో భాగంగా జిల్లా కేంద్రంలోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు) గోడౌన్ను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ టి.ఎల్. సంగీత పాల్గొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గోడౌన్ సీళ్లను తెరిపించి, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు మరియు ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. యంత్రాల భద్రత, నిల్వ విధానం, రికార్డుల నిర్వహణ, భద్రతా ప్రమాణాల అమలు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సామాగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈవీఎంలు మరియు ఇతర ఎన్నికల పరికరాల నిర్వహణలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎం గోడౌన్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, మాస మరియు త్రైమాసిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రతకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ జైరాం నాయక్, పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాక్ అన్నంత మాత్రాన.. వాస్తవాలు మారవు

## ఐక్యరాజ్యసమితిలో భారత్ ఆగ్రహం



న్యూయార్క్, జూన్ 6: అంతర్జాతీయ వేదికలపై పదేపదే భంగపాటుకు గురవుతున్నప్పటికీ.. దాయాది పాకిస్థాన్ భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం మానడం లేదు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మరోసారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తి భారత్ ఆగ్రహానికి గురైంది. ఈసందర్భంగా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవడంపై భారత్ విరుచుకుపడింది.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వార్షిక నివేదికపై సాధారణ సభలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పాక్ శాశ్వత ప్రతినిధి అసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. భారత అంతర్గత వ్యవహారాల్లో పాక్ పదేపదే జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. విభజన రాజకీయ ప్రయోజనాల కోసం ఐరాస వంటి ప్రతిష్టాత్మక వేదికలను దుర్వినియోగం చేయడం పాక్కు పరిపాటిగా మారిపోయిందని మండిపడ్డారు. భారతదేశం అంతర్గత విషయాలపై తప్పుడు, పక్షపాత కథనాలు ప్రచారం చేసేందుకు ఇది వేదిక కాదని విమర్శించారు. జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని పునరుద్ఘాటించారు. దీనికి విరుద్ధంగా ఆ దేశం చేసే వాదనలు వాస్తవాలను మార్చలేవని స్పష్టంచేశారు. దాయాది దేశం ఇప్పటికైనా తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. ఈసందర్భంగా ప్రస్తుత, భవిష్యత్తు సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు భద్రతా మండలిలో సంస్కరణలు అవసరమని భారత ప్రతినిధి పేర్కొన్నారు.

# ట్రంప్-నెతన్యాహు స్నేహం చెడిందా..?

### ఇజ్రాయెల్‌కు అమెరికా బర్నర్ ఫోన్లు

### అంతర్జాతీయ మీడియా కథనాలు



వాషింగ్టన్, జూన్ 6: ఇరాన్‌తో యుద్ధం ముగింపు విషయంలో అమెరికా-ఇజ్రాయెల్ మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలకు మొగ్గు చూపుతుండగా ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌పై దాడులు ఆపడం లేదు. ఇప్పటికే పశ్చిమాసియా ఘర్షణల్లో ఫలితం ఎటూతేలక అసహనంతో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెంజమిన్ నెతన్యాహుపై ఫైర్ అయినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు వాటికి బలం చేకూరేలా మరో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇజ్రాయెల్ పర్యటనల సందర్భంగా అమెరికా ప్రతినిధులు బర్నర్ ఫోన్లు (తాత్కాలికంగా వినియోగించేవి), కంప్యూటర్లను వాడుతున్నారని, అక్కడి హోటల్ గదుల్లో బస చేసినప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ అధికారులు సమాచార సేకరణలో ఎంత దూకుడుగా ఉంటారో అందరికీ తెలిసిందేనంటూ ఓ యూఎస్ అధికారి వ్యాఖ్యలను కథనాల్లో పేర్కొన్నాయి. మరోవైపు, ఇజ్రాయెల్ నుంచి గూఢచర్య ముప్పు తీవ్రతను గుర్తించిన పెంటగాన్ తమ సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు సమాచారం. అమెరికా డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అంతర్గతంగా తన సిబ్బందికి ఈ మార్పు గురించి తెలియజేసిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పశ్చిమాసియా ఘర్షణలపై ట్రంప్ యంత్రాంగం అంతర్గత చర్చలు, నిర్ణయాలను తెలుసుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నించే అవకాశం ఉందని పెంటగాన్ అనుమానిస్తోంది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. అమెరికా సంస్థలు, ప్రభుత్వ అధికారుల నుంచి తాము ఎలాంటి సమాచారం సేకరించడం లేదని వాషింగ్టన్‌లోని ఇజ్రాయెల్ ఎంబసీ ప్రతినిధి వెల్లడించారు. ఇజ్రాయెల్ గూఢచర్య ప్రయత్నాలు శత్రువులే లక్ష్యంగా ఉంటాయన్నారు. దీనికి భిన్నంగా వచ్చే ఆరోపణలు నకిలీవని, రాజకీయ ప్రేరేపితమైనవని చెప్పారు. వైట్‌హౌస్ అధికారి ఒకరు కూడా ఈ గూఢచర్య కథనాలను తోసిపుచ్చారు. అంతర్గత విషయాలపై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తి ఇచ్చిన సమాచారమే ఇలాంటి వార్తలకు కారణమన్నారు.

మామూలుగా అమెరికా, ఇజ్రాయెల్ అత్యంత సన్నిహిత దేశాలు. కొన్ని దశాబ్దాలుగా వాటి నిఘా సంస్థలు కలిసి పనిచేస్తున్నాయి. అయితే ప్రస్తుతం వస్తోన్న ఆరోపణలు ఈ నమ్మకాన్ని దెబ్బతీస్తాయేమోనని మాజీ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇక, బర్నర్ ఫోన్లు అంటే.. తాత్కాలిక అవసరాల కోసం వినియోగించే ప్రీపెయిడ్ ఫోన్లు. తాత్కాలిక ఉపయోగం తర్వాత ఆ ఫోన్‌ను, సిమ్ కార్డును పారవేస్తారు. లేదంటే బర్న్ చేస్తారు. ఫోన్ నంబర్‌ను, సమాచారాన్ని ఎవరూ ట్రేస్ చేయకుండా, గోప్యత కోసం వీటిని వాడుతుంటారు.

# లక్ష బొద్దింకలు సీజ్..



న్యూ సౌత్‌వేల్స్, జూన్ 6: ఆస్ట్రేలియాలో అక్రమంగా బొద్దింకలు పెంచుతున్న కేంద్రంపై ఇటీవల అక్కడి అధికారులు దాడి చేశారు. దాదాపు లక్ష కీటకాలను సీజ్ చేశారు. న్యూ సౌత్‌వేల్స్ రాష్ట్రంలోని బథర్స్ట్ నగరంలో ఓ వ్యాపారి వీటిని అక్రమంగా పెంచుతున్నట్లు గుర్తించినట్లు స్థానిక పర్యావరణ, నీటి సంరక్షణ విభాగం వెల్లడించింది. ఒకేచోట ఈ స్థాయిలో బొద్దింకలను సీజ్ చేయడం దేశంలో ఇదే తొలిసారి అని పేర్కొంది. సీజ్ చేసిన వాటిలో మడగాస్కర్ హిస్సింగ్, దుబియా జాతులకు చెందిన బొద్దింకలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. స్థానిక వన్యప్రాణులకు, జీవ వైవిధ్యానికి హాని కలిగించే ఇటువంటి బొద్దింకలను దిగుమతి చేసుకోవడం, పెంచడం, విక్రయించడం చట్టవిరుద్ధమని తెలిపారు.

సాధారణంగా బొద్దింకలు ఒకటి నుంచి ఒకటిన్నర అంగుళం పొడవు ఉంటాయి. కానీ, మడగాస్కర్ హిస్సింగ్ మాత్రం బొద్దింక జాతుల్లో ప్రపంచంలోనే అతిపెద్దవి. ఒక్కోటి రెండు, మూడు అంగుళాల (5 నుంచి 8 సెం.మీ) పొడవు ఉంటాయి. మెరిసే గోధుమ రంగులో ఉండే ఈ కీటకాలు మనిషి చేతి వేలు కన్నా పెద్దవిగా ఉండటం విశేషం. అయితే, పెంపుడు సరీసృపాలకు ఆహారంగా వేసేందుకు ఇలాంటి పెద్ద సైజులో ఉండే బొద్దింకలను విక్రయిస్తుంటారని నిపుణులు చెబుతున్నారు.

# నాలుగు హైకోర్టులకు...

## ప్రధాన న్యాయమూర్తులుగా మహిళలు

ఢిల్లీ, జూన్ 6: దేశంలో తొలిసారిగా ఏకకాలంలో నాలుగు రాష్ట్రాల హైకోర్టులకు మహిళలు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తులుగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతస్థాయి న్యాయవ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందనడానికి ఇది సూచికగా నిలుస్తోంది. జస్టిస్ మీనాక్షి మదన్ రాయ్ పాట్నా హైకోర్టుకు, జస్టిస్ సునీతా అగర్వాల్ గుజరాత్ హైకోర్టుకు, జస్టిస్ రేవతి మోహితే డేరే మేఘాలయ హైకోర్టుకు, జస్టిస్ లిసా గిల్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తులుగా వ్యవహరిస్తున్నారు. జస్టిస్ సునీతా అగర్వాల్ 2023 జులై నుంచి గుజరాత్ హైకోర్టుకు నేతృత్వం వహిస్తున్నారు. జస్టిస్ లిసా గిల్ 2026, ఏప్రిల్ 25న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అలాగే దేశంలోని వివిధ హైకోర్టుల్లో మొత్తం 781 మంది న్యాయమూర్తులు ఉండగా, అందులో 116మంది మహిళలు.

మొత్తం హైకోర్టు న్యాయమూర్తుల్లో దాదాపు 14.85 శాతం మంది మహిళలని గత ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలియజేసింది. దేశంలోని నాలుగు హైకోర్టులకు మహిళలు ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేయడం 2018లో ఆవిష్కృతమైంది. అయితే అందులో ముగ్గురు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తులు కాగా ఒకరు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు.

# హెచ్-1బీ వీసాపై..

## అమెరికా కాంగ్రెస్‌లో కీలక బిల్లు

### భారత్ మా టార్గెట్ కాదు

### విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్




వాషింగ్టన్, జూన్ 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఈనేపథ్యంలో హెచ్-1బీ వీసాలకు సంబంధించి అమెరికా కాంగ్రెస్ ముందుకు ఓ కీలక ముసాయిదా బిల్లు వచ్చింది. గ్రీన్ కార్డు పొందేందుకు హెచ్1బీ వీసాను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ దీనికి స్వస్తి పలకాలని కోరుతూ ఓ రిపబ్లికన్ నేత బిల్లును ప్రవేశపెట్టారు.

కాంగ్రెస్ సభ్యుడు చిప్రాయ్ గురువారం 'అమెరికన్ వైట్-కాలర్ వర్కర్ జాబ్స్' పేరుతో ఈ ముసాయిదా బిల్లును తీసుకొచ్చారు. విదేశీ విద్యార్థులు పట్టభద్రులైన తర్వాత పరిమిత కాలం పాటు అమెరికాలో పనిచేసేందుకు అనుమతించే ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కార్యక్రమాన్ని కూడా రద్దు చేయాలని ఇందులో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దాదాపు నలభై ఏళ్ల చరిత్రలో హెచ్1బీ వీసా దుర్వినియోగం అయ్యిందన్నారు. దీని కారణంగా చౌకైన విదేశీ కార్మికుల కోసం అమెరికన్ స్టెమ్ (సైన్స్,టెక్నాలజీ,ఇంజనీరింగ్ మరియు మ్యాథమెటిక్స్) రంగాలకు చెందినవారిని పక్కనపెడుతున్నారని ఆరోపించారు. ఈ లాటరీ ఆధారిత విధానానికి ముగింపు పలకాలని కోరారు. దాని స్థానంలో ప్రతిభకు, వాస్తవ వేతన ప్రమాణాలను అమలుచేస్తూ.. అమెరికన్ వైట్ కాలర్ ఉద్యోగులకు ప్రాధాన్యమిచ్చే వ్యవస్థను తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ బిల్లుకు యూఎస్ టెక్ వర్కర్స్, ఇమిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమిగ్రేషన్ రిఫార్మ్ మద్దతు తెలిపాయి.

హెచ్1బీ వీసాల నిబంధనలు కఠినతరం చేయడంపై భారతీయుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో అమెరికా క్లారిటీ ఇచ్చింది. తమ దేశ వీసా చట్టాలు ప్రత్యేకంగా భారత్‌ను లక్ష్యంగా చేసుకొని రూపొందించినవి కావని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ పిగోట్ పేర్కొన్నారు. అన్ని దేశాలకూ అవే నిబంధనలు వర్తిస్తాయని స్పష్టంచేశారు. 'గత ప్రభుత్వాలు వీసా చట్టాన్ని సరిగా అమలుచేయలేదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మేం వీటిని కచ్చితంగా అమలుచేస్తున్నాం. భారత్ను లక్ష్యంగా చేసుకునే వీసా చట్టాలు ఏవీ లేవు' అని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌తో కాల్పుల విరమణ..

### ట్రంప్‌నకు రుణపడి ఉంటాం

### పాక్ ప్రధాని షెహబాజ్



ఇస్లామాబాద్, జూన్ 6: భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సరైన సమయంలో జోక్యం చేసుకొని కాల్పుల విరమణకు దోహదం చేశారని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. అందుకు పాక్ ఆయన పట్ల ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటుందన్నారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఇక్కడ యూఎస్ ఎంబసీ నిర్వహించిన కార్యక్రమంలో షెహబాజ్ మాట్లాడారు. గతేడాది పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య నాలుగురోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతల గురించి ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ''పహల్గాం ఘటన తరువాత భారత్ మాపై దాడికి దిగింది. ఆ సమయంలో ట్రంప్ జోక్యంతోనే భారత్-పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ సాధ్యమైంది. ట్రంప్ తన కీలక నిర్ణయంతో దక్షిణాసియాలో శాంతిని నెలకొల్పి లక్షల మందిని కాపాడారు. ఆయన శాంతి కాముకుడిగా గుర్తుండిపోతారు'' అని షెహబాజ్ కొనియాడారు.

# రాష్ట్రపతి పాలన నివారించేందుకే..

- టీవీకే ప్రభుత్వానికి ఓకే చెప్పాం
- మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నై, జూన్ 6: తమిళనాడులో టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్ సహా డీఎంకే కూటమి పక్షాలు మద్దతు ఇవ్వడంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కే స్టాలిన్ స్పందించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడాన్ని నివారించాలనే ఏకైక ఉద్దేశంతోనే టీవీకేకు మద్దతిచ్చేందుకు తమ కూటమిలోని భాగస్వామ్య పక్షాలను అనుమతించామని పేర్కొన్నారు. ఏఐఏడీఎంకే పార్టీకి చెందిన కొందరు నేతలు డీఎంకేలో చేరిక సందర్భంగా చెన్నైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టాలిన్ ఈ విధంగా మాట్లాడారు. ''టీవీకేతో వెళ్లే విషయాన్ని కూటమిలోని కొన్ని పార్టీలు తన దృష్టికి తీసుకురాగా.. 'మీరు వెళ్లొచ్చు. అది మీ ఇష్టం.. ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. మిమ్మల్ని ఆపను' అని చెప్పాను. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించడం నివారించాలనే ఏకైక ఉద్దేశంతో నేను వారిని అనుమతించాను. అలా చేయకపోతే తమిళనాడులో బీజేపీ పాలనకు మార్గం సుగమం అయ్యేది'' అని స్టాలిన్ అన్నారు. తమ కూటమిలోని పార్టీలు మద్దతు ఇవ్వడం వల్లే ప్రస్తుత ప్రభుత్వం నడుస్తోందని స్టాలిన్ పేర్కొన్నారు. డీఎంకే అధికారంలోకి రావాలనే ఆ పార్టీలు కోరుకున్నాయని, అందుకే తమతో పొత్తు పెట్టుకున్నాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తమ పార్టీని నిరుత్సాహపరచలేవని.. ప్రతిపక్షంలో ఉంటూనే ప్రజలకు సేవ చేస్తామన్నారు.

# ఓడిపోయి బాధలో ఉంటే.. చప్పట్లు కొట్టమన్న మమతాబెనర్జీ

## టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ



కోల్‌కతా, జూన్ 6: మమత బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అభిషేక్ వల్లే పార్టీలో అంతర్గత తిరుగుబాటు జరిగిందని ఆరోపించారు. మమతా బెనర్జీని తాము గౌరవిస్తున్నామని అయితే తమపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ పెత్తనాన్ని మాత్రం అంగీకరించబోమని స్పష్టంచేశారు. పార్టీ కోసం ఏమీ చేయకపోయినా మమతాబెనర్జీ ఆయనకు ఉన్నత స్థానాన్ని కట్టబెట్టారని విమర్శించారు. బెంగాల్ ఎన్నికల్లో టీఎంసీ ఓటమి అనంతరం మమతా బెనర్జీ కాళీఘాట్ నివాసంలో సమావేశం నిర్వహించారని రితబ్రత పేర్కొన్నారు. పార్టీ కోసం అభిషేక్ చేసిన కృషికి గానూ నిలబడి చప్పట్లు కొట్టాలని సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలకు మమత సూచించారని రితబ్రత పేర్కొన్నారు. ఎన్నికల్లో ఓడిపోయిన బాధలో ఉన్న తమను ఈ చర్య మరింత బాధించిందని అన్నారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేల చేత సంతకాలు తీసుకున్నారని హాజరు కాని వారి పేర్లను అధికారిక రికార్డుల్లో రాసుకున్నారని ఆరోపించారు. టీఎంసీలో అవినీతి బాగా పెరిగిపోయిందని దానిని ప్రక్షాళించాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ప్రస్తుతం 61 మంది ఎమ్మెల్యేలు తమతో ఉన్నారని రాబోయే రోజుల్లో మరికొంతమంది తమతో పాటు కలిసే అవకాశం ఉందన్నారు.కాగా టీఎంసీ పార్టీలోని చాలా మంది నాయకులు అభిషేక్ బెనర్జీ పనితీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. శుభేందు అధికారి సహా పలు నేతలు పార్టీనీ వీడి వెళ్లడానికి కూడా అభిషేక్ వైఖరే కారణమన్న ఆరోపణలూ ఉన్నాయి. మమత కష్టపడి క్షేత్రస్థాయి నుంచి పార్టీని నిర్మిస్తే.. అభిషేక్ తృణమూల్‌ను ఐ-పాక్ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టారని పలువురు నేతలు బహిరంగంగానే విమర్శలు చేశారు. పార్టీ ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణం ఆయనేనని నిందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మేనల్లుడి విషయంలో మమతాబెనర్జీ ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

# పనిపై సమగ్ర అవగాహన కోసమే సైట్ విజిట్ నిబంధన

- కారుణ్య నియామకాల అక్రమాల కేసులో ఇద్దరి అరెస్టు
- సింగరేణి యాజమాన్యం ప్రకటన

హైదరాబాద్, జూన్ 6 : 137 ఏళ్లుగా మైనింగ్ రంగంలో ఉన్న సింగరేణి కాలరీస్ దశాబ్దాలుగా దక్షిణాదిలో పలు రాష్ట్రాలకు నిరాటంకంగా బొగ్గు రవాణా చేస్తోంది. 39 గనులున్న సింగరేణిలో నిత్యం బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతున్న నేపథ్యంలో కొంత మొత్తంలో బొగ్గు స్టాక్ గా ఉండటం అత్యంత సహజం. ఈ ఏడాది కూడా సింగరేణి సంస్థలో ఈ నెల 4వ తేదీ వరకు 26.51 లక్షల టన్నుల బొగ్గు వివిధ ఏరియాల్లోని గనులు, సీహెచ్పీల్లో నిలువగా ఉంది. ఇది గత పదేళ్ల స్టాక్ చరిత్రలో అత్యల్పం. స్టాక్ గా ఉన్న బొగ్గును ఎప్పటికప్పుడు రైలు మార్గం, రోడ్డు మార్గం ద్వారా అవసరమైన వినియోగదారులకు రవాణా చేయడం జరుగుతుంది. ఇది బొగ్గు కంపెనీలలో ఒక సహజమైన రవాణా పరిణామం.

**గతంలో సగటున 50 లక్షల నిల్వలు..**

ముఖ్యంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా జరిగే నవంబరు నుంచి మే మాసాల మధ్య బొగ్గు నిల్వలు పేరుకుపోతూ ఉంటాయి. ఇలా ఉన్న బొగ్గు నిల్వలను పలు కారణాల వల్ల ఉత్పత్తి తగ్గిన సమయంలో వీటిని థర్మల్ కేంద్రాలకు సరఫరా చేస్తూ రావడం ఏళ్ల తరబడి కొనసాగుతూ వస్తున్న ఆనవాయితీ. 2014 నుంచి కూడా ఇదే విధంగా బొగ్గు నిల్వలు ఉంటున్న విషయం గమనార్హం. 2015-16లో 70 లక్షల టన్నులు, 2016-17 లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు రికార్డు అయింది. 2014 నుంచి 2024 వరకు సగటును 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సీహెచ్పీల వద్ద ఉన్న విషయం గమనార్హం. ముఖ్యంగా వర్షాకాలం కోసం కూడా బొగ్గు నిల్వలు ఉండటం అత్యవసరం. లేనిపక్షంలో థర్మల్ కేంద్రాలకు సరిపడా బొగ్గును రవాణా చేయలేని పరిస్థితులు ఉంటాయి. థర్మల్ పవర్ స్టేషన్ల అవసరాలకు 15 రోజులపాటు సరిపడేలా కనీసం 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచడం జరుగుతుంది. తద్వారా వర్షాకాలంలో విద్యుత్ కేంద్రాలకు నిరాటంకంగా బొగ్గు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. దేశంలో ప్రతీ బొగ్గు కంపెనీ వద్ద కూడా ఇలాంటి నిల్వలు ఉండటం అత్యంత సహజం. అవసరం కూడా.

**సైట్ విజిట్ సర్టిఫికేట్ ఎందుకంటే???**

సింగరేణి కాలరీస్ లో ఓవర్ బర్డెన్ తొలగింపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అతి కీలకమైనది. సంస్థ నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే బొగ్గు పొరలపై ఉండే పై మట్టి (ఓవర్ బర్డెన్) ను సకాలంలో తొలగించాల్సి ఉంటుంది. ఈ ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టడం జరుగుతుంది. సింగరేణి కాంట్రాక్టులను బహిరంగ టెండర్ల ద్వారానే కాంట్రాక్టర్లకు అప్పగించడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎక్కువశాతం ఓవర్ బర్డెన్ టెండర్లలో, కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక- గనుల పరిస్థితులు, సామాజిక-రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు మొదలైన వాటిని సమగ్రంగా అంచనా వేయకుండా టెండర్లలో పాల్గొంటున్నారు.దీని ఫలితంగా పనితీరు దెబ్బతిని, సింగరేణికి బొగ్గు ఉత్పత్తి లో నష్టం, కాంట్రాక్టర్లకు ఆర్థిక నష్టం జరుగుతూ, న్యాయ సమస్యలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. శ్రీరాంపూర్ ఓసీ-2 ప్రాజెక్టులో, శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీలో సైట్ను సరిగ్గా అంచనా వేయకపోవడం వల్ల ఓవర్ బర్డెన్ తొలగింపు పనులను మధ్యలో వదిలేయడం జరిగింది. ఫలితంగా కంపెనీ నిర్దేశించుకున్న లక్ష్యాలకు విఘాతం కలిగింది. టెండర్లలో పాల్గొనే వారు పని ప్రదేశ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, పనుల పరిధి తదితర అంశాలను పూర్తిగా అవగాహన చేసుకోవడమే సైట్ విజిట్ ముఖ్య ఉద్దేశం. అన్ని పరిస్థితులు, మార్పులను పరిగణనలోకి తీసుకొని రేట్లు కోట్ చేస్తాడని నిర్ధారించడమే దీని లక్ష్యం. ఇది పోటీని పరిమితం చేయడానికి మాత్రం కాదు. ఆరోగ్యకరమైన పోటీ, పనుల సమర్థవంతమైన అమలుకు దోహదపడేందుకు తీసుకున్న చర్య. సంపూర్ణ అవగాహనతో పకడ్బందీ ప్రణాళికతో ఓబి తొలగింపు జరుగుతుందని భావిస్తూ తీసుకున్న చర్య.

**ఎప్పటి నుంచి ప్రవేశపెట్టారు..**

సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన కేవలం సింగరేణిలోనే కాదు అనేక ప్రభుత్వ సంస్థలలో, ప్రైవేటు సంస్థల్లో కూడా ఇప్పటికే అమలులో ఉంది. సింగరేణిలో మే 2025 నుండి ఓవర్ బర్డెన్ టెండర్లకు సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఇప్పటికే s/టఎశ్రిఇ (గుజరాత్), s/టఎక్విఇఔ, s/ట్యూశ్రిఇ, కొన్ని సౌర విద్యుత్ ప్రాజెక్టులు మరియు ఉశ్రిఇ కాంట్రాక్టుల్లో అమల్లో ఉంది. సింగరేణిలోనే 2018, 2021, 2023 సంవత్సరాల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లకు (కోల్ ఇండియా అనుబంధ సంస్థ) సలహా మేరకు సైట్ విజిట్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చేశారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత మంజూరైన టెండర్లు ఎలాంటి సమస్యలు లేకుండా మంచి పనితీరుతో కొనసాగుతున్నాయి.

# 'బలి ఇస్తాం' బిడ్డ వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌కి బెదిరింపులు

- జనసేన మద్దతుదారు అరెస్ట్
- హద్దులు దాటితే చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలతో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొర్ర చందర్ లాల్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనసేన మద్దతుదారుడుగా ఉన్న చందర్ లాల్, పవన్ కల్యాణ్ ప్రెస్ మీట్ జరిగిన రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్రమైన వ్యాఖ్యలు చేశాడు. 'జనసేనతో పెట్టుకున్నావ్.. రేవంత్ రెడ్డి, నిన్ను బలి ఇస్తాం' అంటూ దూషించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై కేసు (క్రైమ్ నం. 395/2026) నమోదు చేసిన తెలంగాణ పోలీసులు, నిందితుడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, పరిమితులు దాటితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# తక్షణమే ఉద్యమకారుల గుర్తింపు కార్యాచరణ ప్రారంభించండి

- 21 ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం
- కేసీఆర్, కేటీఆర్‌కు 250 గజాల స్థలం ఇవ్వాలి?
- ఆ పేదవారిని పట్టించుకోకపోవడంవల్లే ఈ సమస్య వచ్చిందని పిడమర్తి రవి వ్యంగాస్త్రాలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఉవ్వెత్తున ఎగసిపడిన మలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం.. యావత్ తెలంగాణ ప్రజానికాన్ని సైతం మలుపుతిప్పిన సంగతి తెలిసిందే. ఇంతటి మహోన్నత ఉద్యమంలో వేలాది మంది ప్రజలు తమ నిద్రహారాలు,ఆస్తులు, పనులు వదులుకొని మానుకొని మరి ప్రత్యక్ష్యంగా, పరోక్ష్యంగా రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నారు. నాటి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కేసీఆర్, కేటీఆర్‌కు సైతం 250 గజాల స్థలాన్ని కేటాయించాలని..నాటి టీఎస్ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... కేసీఆర్, కేటీఆర్‌లు సైతం అత్యంత పేదవారని ఆయన ఏద్దేవా చేశారు. ఆ పేదవారిని పట్టించుకోకపోవడం వల్లే ఇతర ఉద్యమకారులందరికి ఈ సమస్య వచ్చిందని పిడమర్తి వ్యంగస్త్రాలు సంధించారు.

తాజాగా ఈ మేరకు... తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కరపత్రాన్ని శనివారంనాడు అవిష్కరించారు. ఉస్మానియా యూనివర్సిటీ బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ జేఏసీ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారు. జూన్ 21న ఇందిరా పార్కులో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం గుర్తింపుకార్డు, పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఏళ్లే దాటి పోయాయని, కాలయాపన చేయకుండా తక్షణమే ఉద్యమకారులను గుర్తింపు కార్యాచరణ ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వానికి రవి విజ్ఞప్తి చేశారు.

ఇందిరా పార్కులో తలపెట్టిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వేలాది మంది తెలంగాణ ఉద్యమకారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బొరెల్లి సురేష్, ఓయూ జేఏసీ నాయకులు ప్రభాకర్, వీరేంటి విజయ్, బీఎస్ఎఫ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్, బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చెవుల కిషన్,బీఎస్ఎఫ్ ఓయూ ఉపాధ్యక్షులు ఆరెకంటి శ్రీకాంత్, నాయకులు బాలు,రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతిరోజూ నేనే పరిశీలిస్తా

- మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 6: మనం ప్రతినిధిః** గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతి రోజూ తాను పరిశీలిస్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఉపాధి హామీ పనులు, గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, సెర్ప్ శాఖ అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసని అనసూయ సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క అక్కడి నుంచే శనివారం శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 8 వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈ భవనాలు కేవలం నిర్మాణాలు కాదని, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే 'ఆత్మగౌరవ భవనాలు' అని మంత్రి పేర్కొన్నారు. వాటి నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించేందుకు రెగ్యులర్గా వీడియో కాన్ఫరెన్సులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి రోజు పనుల పురోగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, అవసరమైతే రోజువారీ వీడియో కాన్ఫరెన్స్ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని మంత్రి స్పష్టం చేశారు. అందుకే తానే స్వయంగా సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తానన్నారు. ప్రతి ఎంపీడీవో తమ మండలంలో ప్రోగ్రాం ఆఫీసర్గా వ్యవహరిస్తూ గ్రామాల్లో భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై కూడా ప్రత్యేక దష్టి సారించి, లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు జరగాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# నాణ్యమైన విత్తనాలే రైతులకు అందించాలి

విత్తనాల నాణ్యతపై రాజీ లేదు, రైతుల సంక్షేమమే లక్ష్యం
రైతుల నష్టాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు
ఎరువులు, విత్తనాల సరఫరాలో పారదర్శకత తప్పనిసరి
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను సరఫరా చేయాలి
వ్యవసాయ సీజన్కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..మంత్రి సీతక్క



**ములుగు, జూన్ 6, మనం ప్రతినిధిః** నాణ్యమైన విత్తనాలే రైతులకు అందించాలని, విత్తనాల నాణ్యతపై రాజీ పడే ప్రసక్తే లేదని, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, రైతులను నష్టాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తప్పవని, ఎరువులు, విత్తనాల సరఫరాలో పారదర్శకత పాటిస్తూ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులను సరఫరా చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనములు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విత్తన కంపెనీలు, డీలర్లు, ఆర్గనైజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు విక్రయించే విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని, ప్రతి లావాదేవీకి సంబంధించి పూర్తి వివరాలతో పారదర్శక ఒప్పందాలు ఉండాలని తెలిపారు. గతంలో కల్తీ విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కంపెనీ యాజమాన్యాలు, డీలర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. రైతుల నష్టాలకు కారణమయ్యే నాసిరకం, నకిలీ విత్తనాల విక్రయాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. విత్తనాల చట్టం ప్రకారం అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, వ్యవసాయ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విత్తన కంపెనీలు జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా స్థానిక స్థాయిలో నియామకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని, వారి జీవితాలతో ముడిపడిన వ్యవసాయ రంగంలో నిర్లక్ష్యానికి తావులేదని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలిగించే చర్యలు చివరికి సమాజానికే నష్టాన్ని కలిగిస్తాయని, అందరూ నైతిక బాధ్యతతో వ్యవహరించి రైతుల విశ్వాసాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు. వర్షాకాల వ్యవసాయ సీజన్కు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పట్టాలు లేని రైతుల పరిస్థితిని ప్రత్యేకంగా గుర్తించి, వారికి కూడా ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టాలు లేని రైతుల సంఖ్యపై మండలాల వారీగా అంచనా వేసి వారిని కూడా వ్యవసాయ సేవల పరిధిలోకి తీసుకురావాలని అన్నారు. రైతులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ విధానాలు, తాత్కాలిక నమోదు వంటి సౌకర్యాలపై విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామస్థాయిలో రైతులకు పూర్తి సమాచారం చేరేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొనుగోళ్ల విషయంలో అపోహలు, అనవసర నిల్వలు ఏర్పడిన నేపథ్యంలో ఈసారి ముందస్తు ప్రణాళికతో అవసరాలను అంచనా వేసి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే మండలాల వారీగా డీలర్లు, వ్యవసాయ అధికారులతో సమావేశాలు నిర్వహించి రైతుల అవసరాలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల పంపిణీ జరగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా పంటల విస్తీర్ణం, రైతుల సంఖ్య, అవసరమైన ఎరువుల పరిమాణంపై స్పష్టమైన వివరాలు సిద్ధం చేసి, ఎలాంటి కొరత లేదా కృత్రిమ కొరత పరిస్థితులు తలెత్తకుండా పకడ్బందీగా పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో పారదర్శకత, సమన్వయం, ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమం, పంటల విజయవంతమైన సాగు ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి సీతక్క జిల్లా ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లాలో చేపడుతున్న సీసీ రోడ్లు, మహిళా సంఘాల భవనాలు తదితర అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, మహిళా సంఘాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేసి బిల్లుల అప్లోడ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, అలాగే రైతులకు ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి కేటాయించిన ప్రతి రూపాయి ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వినియోగించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ముందుగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ డీలర్లకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని, నకిలీ పురుగుల మందులు అమ్మ వద్దని , ప్రతి మండలంలో విత్తనాలు, ఎరువుల సరఫరాను పర్యవేక్షించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వానకాలం సాగును విజయవంతం చేయడమే అందరి ఉమ్మడి లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, సంబంధిత అధికారులు, డీలర్లు, ఇంజనీరింగ్ అధికారులు, పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సభ



**తిరుమలగిరి జూన్ 06 (మనం న్యూస్)ః** తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగం13 వార్డులో సభ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ రెడ్డి, వైస్ చైర్మన్ గోవిందమ్మ రవీందర్, డిప్యూటీ తహసిల్దార్, వార్డు కౌన్సిలర్ సంకేపల్లి జ్యోతి నరోత్తం రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ , ఎండీ జకియా మొహమ్మద్, హెల్త్ ఆఫీసర్, స్కూల్ హెడ్ మాస్టర్ ,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల భద్రత, విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్త్



**నల్లగొండ, జూన్ 6 (మనం ప్రతినిధి)ః** పిల్లలు సురక్షితంగా ఉంటేనే సమాజం సురక్షితంగా ఉంటుందని, ప్రతి తల్లి-తండ్రి పిల్లల భద్రత, విద్య, విలువల పెంపకానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ రాష్ట్ర డీజీపీ అభిలాష బిస్త్ అన్నారు. శనివారం ఆమె కనగల్లు మండలం, చెర్లగౌరారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల పంచాయతీ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. చిన్నప్పటి నుండే పిల్లలకు విద్యతో పాటు, కష్టపడే తత్వం, నైతిక విలువలు నేర్పించాలని సూచించారు. భవిష్యత్తులో పిల్లలు కుకింగ్, కబడ్డీ, వాలీబాల్, క్రీడలు, కళలు తదితర అన్ని రంగాల్లో రాణించి దేశాభివృద్ధికి తోడ్పడతారని అన్నారు. దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. బాల పంచాయతీలో విద్యార్థులు తమ గ్రామంలో ఉన్న సమస్యలను భయపడకుండా ధైర్యంగా ప్రస్తావించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. సమాజంలో మార్పు రావాలంటే పిల్లలు బాగా చదవాలని, తల్లిదండ్రులు వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. ప్రస్తుతం కాలుష్యం పెద్ద సమస్యగా మారిందని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు గ్రామంలో చెత్త సమస్య, పాఠశాలకు బస్సు సౌకర్యం, కొత్త పాఠశాల భవనం, ఆట స్థలం వంటి అవసరాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థులు చూపిన చొరవను అభినందించిన ఆమె, ఈ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ను కోరారు. సి.ఎస్.ఆర్. నిధుల ద్వారా పాఠశాల భవనానికి పెయింటింగ్ మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, పిల్లలు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని చెప్పాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు.

**జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ**

పోలీసు శాఖ చేపట్టిన బాల పంచాయతీ కార్యక్రమం విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను వెలికితీసే మంచి వేదికగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు ఎంతో ధైర్యంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం అభినందనీయమని చెప్పారు. చదువుతో పాటు , కుకింగ్, వాలీబాల్, క్రికెట్ తదితర రంగాల్లో ప్రతిభ కనబరచాలని సూచించారు. ప్రస్తుతం 12 సంవత్సరాల వయస్సులో ఉన్న ఈ చిన్నారులే 2047లో స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలను చూసే భావితరమని, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ, బాల పంచాయతీ ద్వారా విద్యార్థులు గ్రామ సమస్యలను, తమ అవసరాలను నిర్భయంగా వెల్లడించారని చెప్పారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి బాల పంచాయతీ నిర్వహించి, విద్యార్థులు తెలిపిన సమస్యల పరిష్కారంపై సమీక్ష చేపడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు విద్యార్థులు నిర్వహించిన బాల పంచాయతీలో గ్రామంలో చెత్త సమస్యను నివారించాలని, బాల కార్మికత్వాన్ని అరికట్టాలని, పాఠశాలకు ఆట స్థలం, బస్సు సౌకర్యం కల్పించాలని, ప్రతి చిన్నారికి విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు చూపిన చైతన్యం, ధైర్యం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సమావేశానికి. ఎ.ఎస్.పి రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, డి.ఎస్.పి శివరాం రెడ్డి, సి డబ్ల్యూ ఓ చైర్మన్ చింత కృష్ణయ్య,ఎంపీడీవో వేద, సర్పంచ్ చిలకరాజు సునీత వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ కల్మూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



**సూర్యాపేట, జూన్ 06 (మనం ప్రతినిధి)ః** రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను అదేశించారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న జరిగే మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ₹అదనపు కలెక్టర్ బి హరి సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లు వెనువెంటనే లారీల్లో మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యే విధంగా చూడాలని సూచించారు.జూన్ 9వ తేదీన హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని బస్సులు ఆయా మండలాల నుంచి మహిళా సంఘాల సభ్యులను తీసుకొని సాయంత్రం 4 గంటల లోపల హైదరాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ కి చేరుకునే విధంగా చూడాలని స్పష్టం చేశారు. మహిళలకు మార్గమధ్యలో భోజనాలు, తాగు నీరు, మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు.నీట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జడ్పీ సీఈఓ శిరీష, డిఆర్డిఓ సన్యాసయ్య, డిపిఓ యాదగిరి, డీఏవో శ్రీధర్ రెడ్డి, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిఎస్ఓ మోహన్ బాబు, డిఎంహెచ్ఓ వెంకట రమణ, ఆర్డిఓ వేణుమాధవ్, డీఈవో అశోక్, డిఐఇఓ సులోచన రాణి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వట్టే జానయ్య అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం



**సూర్యాపేట టౌన్, జూన్ 06, మనం న్యూస్ః** శుక్రవారం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు బుడుగు బలహీన వర్గాల పక్షాన ఉండి వజ్రా టౌన్ షిప్ లోని భూమి అక్రమ రిజిస్ట్రేషన్ అడ్డుకునేందుకు వచ్చిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య అన్నారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు వత్తాసు పలికే విధంగా పోలీసులు వ్యవహరించారని, ఇది ముమ్మాటికీ కుట్ర పూరితంగా జరిగిందని ఆరోపించారు. పోలీసులు నిజానిజాలు తెలుసుకొని భాదితులకు న్యాయం చేయాలన్నారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీల కుట్రలను టి ఆర్ పి ఎల్లప్పుడు ఎండగడుతూనే ఉంటుందని, భాదితుల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టి ఆర్ పి పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, సూర్యాపేట మండల అధ్యక్షుడు సోమ గాని లింగస్వామి గౌడ్, కుంభ వెంకన్న, నేలచర్ల మధు ప్రజాపతి, బోడపట్ల మధు గౌడ్, చింతకాయల జానయ్య, మామిడి శోభన్ గౌడ్, కాంటేకర్ రఘుమోహన్, వట్టే లింగరాజు, వట్యాల శేఖర్, చాంప్లా, సాయి, గుంటూరు విజయ్, రాగం లింగయ్య, మంద లింగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# జనగణను పరిశీలించిన తహసిల్దార్

**తిరుమలగిరి, జూన్ 06 (మనం న్యూస్)ః** తిరుమలగిరి మండలం బండ్లపల్లి గ్రామంలో జనగణన కార్యక్రమాన్ని తహసిల్దార్ బాసిటి హరిప్రసాద్ శనివారం పరిశీలించారు. 2011 జనాభా లెక్కలతో పోలిస్తే 2027 లో జనాభా 102 శాతం కి పెరిగినట్టు ఎనిమినేటర్లు తహసిల్దార్ కు వివరించారు.

తిరుమలగిరి మండలంలో మొత్తంగా 113 శాతం జనాభా నమోదు జరిగింది. అలాగే ఇంటికి తాళాలు వేసిన, ఇల్లు వదిలి వెళ్ళిన మళ్ళీ ఒకసారి వెళ్లి సర్వే చేయాలని ఎనిమినేటర్లను తహసిల్దార్ ఆదేశించారు.



# పేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి గౌరవం



**సూర్యాపేట జూన్ 06 (మనం ప్రతినిధి)ః** ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రస్థాయిలో విశేష గౌరవాన్ని దక్కించుకుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా ఎస్పీ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మదితో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.పట్టణ ప్రగతి పారిశుధ్యం, ఓటరు నమోదు తదితర అంశాలపై ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... సూర్యాపేటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు వినూత్న ప్రయోగాలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పట్టణంలో సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాల నుండి ఇటుకలను తయారు చేస్తూ, దీనిని నిరంతరం కొనసాగే ఒక స్థిరమైన వ్యవస్థగా మార్చడం శుభపరిణామమని కొనియాడారు. ప్రజల భాగస్వామ్యం, శానిటేషన్ (పారిశుధ్య) సిబ్బంది కష్టం వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన అభినందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం దేశంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం అమల్లోకి వచ్చిందని కలెక్టర్ గుర్తుచేశారు. ఈ నిబంధనల ప్రకారం తడి చెత్త మరియు పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, వీటితో పాటు శానిటరీ వేస్ట్ కూడా వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా విభజించాలనే రూల్స్ వచ్చాయి.ఈ నియమాలను పక్కాగా అమలు చేయడంలో సూర్యాపేట మున్సిపాలిటీ రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉందని, భవిష్యత్తులో పారిశుధ్య విభాగంలో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రజలకు హామీ ఇచ్చారు. పట్టణంలో ఇబ్బందిగా మారిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) సమస్యపై ఆయన తీవ్రంగా స్పందించారు. సంబంధిత ఏజెన్సీ అధికారులను పిలిపించి, పనులు త్వరగా పూర్తి చేయాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని స్ట్రాంగ్ వార్నింగ్.ఇచ్చినట్లు కలెక్టర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక' కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన విద్య, వైద్యం, శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను అధికారులు నేరుగా గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లోని ప్రజల వద్దకే తీసుకెళ్తున్నారని చెప్పారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు యంత్రాంగం శ్రమిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత ఉన్న ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోందని, ప్రజలందరూ ఈ స్పెషల్ రివిజన్కు పూర్తి స్థాయిలో సహకరించి తమ పేర్లను నమోదు లేదా సవరణలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ షఫీ ఉల్లా, ఏసీపి ప్రసన్నకుమార్, తహసిల్దార్ కృష్ణయ్య, ఫ్లోర్ లీడర్ వేణుగోపాల్ రావు, వార్డ్ కౌన్సిలర్ షేక్ జహీర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి డాక్టర్ అమూల్య, మున్సిపల్ కిరణ్ కుమార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అంతర్ పంటలు, పంట మార్పిడిపై దృష్టి పెట్టాలి


- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి




హనుమకొండ జూన్ 06(మనం ప్రతినిధి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా దృష్టి సారించాలని సూచించారు.అవసరమైన పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన వరి వంగడాలను సాగు చేయాలని తెలిపారు.రైతులు కందులు, బంతిపూలు, కూరగాయలు వంటి అంతర్ పంటలను ప్రోత్సహించాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా, బంతిపూల వంటి పంటల ద్వారా క్రిమికీటకాల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చని చెప్పారు. అధిక రసాయనాలు కలిగిన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని, వాటి వల్ల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు ఎక్కువగా అవలంబించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, తడి చెత్త, పొడి చెత్త, బయో వేస్ట్, సానిటరీ వేస్ట్ను వేర్వేరుగా సేకరించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు నిరోధించాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఎలక్ట్రోల్ వాటర్ వంటి ద్రవాలను తీసుకోవడం అలవాటు చేసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించి వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు.అదేవిధంగా ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారి చదువుకు కుటుంబాలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. మహిళా సాధికారత, విద్యాభివృద్ధి ద్వారానే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, దుగ్గొండి తహసిల్దార్ సమ్మక్క, గ్రామ ప్రజలు సంబంధిత శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్లదే కీలక పాత్ర

- బీజేపీ ఓటర్ల జాబితాలతో ప్రమాదకర రాజకీయాలు చేస్తోంది
- ఓటు చోరీ ప్రయత్నాలపై ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలి
- ప్రతి బీఎల్ఏ పార్టీకి సైనికుడిలా పనిచేయాలి
- ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి మెట్టు
- అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఓటును కాపాడాలి
- బీజేపీ కుట్రలను ప్రజాస్వామ్యబద్ధంగా తిప్పికొట్టాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య




హనుమకొండ, జూన్ 06(మనం ప్రతినిధి): ఎన్నికల్లో విజయం కేవలం ప్రచారంతో సాధ్యపడదని, బలమైన ఓటర్ల జాబితా నిర్మాణంతోనే విజయానికి పునాది పడుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఆఔఅ పార్టీకి సైనికుడిలా పనిచేస్తూ ప్రతి ఓటును కాపాడాలని ఎంపీ పిలుపునిచ్చారు. రఘునాథపల్లి మండలం, నిడిగొండలోని సత్యసాయి కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో, శాసనసభ్యులు కడియం శ్రీహరితో కలిసి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖిఇఖ (ఖిఇఛిజీఛీజూ ఋఙ్ఝఙఙిజీఛీ ఖఙిజీఛిజూఛ్ఝ) ప్రక్రియపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బూత్ స్థాయి నాయకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, దేశంలో ఓటర్ల జాబితాలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించే ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ఓటర్ల జాబితాల విషయంలో అనుసరిస్తున్న విధానం ఆందోళన కలిగిస్తోందని విమర్శించారు. ప్రజల మద్దతుతో గెలవలేని పరిస్థితుల్లో ఓటర్ల జాబితాల్లో మార్పుల ద్వారా రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు. అది ఎలాంటి కారణాలతోనూ కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. ఓటు చోరీ ప్రయత్నాలపై అప్రమత్తంగా ఉండాలి. ప్రతి బూత్ అధ్యక్షుడు, ప్రతి ఆఔఅ, ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఓటు హక్కు పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో యోధుడిలా పనిచేయాలి' అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా, ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ జరుగుతున్న ప్రతి దశలోనూ అప్రమత్తత అవసరమని ఎంపీ సూచించారు. ఇప్పటివరకు ఓటు వేసిన వారికీ కూడా భవిష్యత్తులో జాబితాలో పేరు లేకపోయే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పుల సవరణ, తొలగించబడిన పేర్ల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీ కోరారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి బూత్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు, శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడంతో పాటు, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించే బాధ్యత కూడా బూత్ ఏజెంట్లపై ఉందని తెలిపారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ పారదర్శకంగా ఉండాలని, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్య విలువలను కాపాడడానికేనని ఎంపీ పేర్కొన్నారు. ఓటర్ల జాబితానే ఎన్నికల విజయానికి తొలి అడుగు. బూత్ బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. బీజేపీ కుట్రలను క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అని డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు. అనంతరం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య రూపొందించిన 'బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్బుక్' ను ఆవిష్కరించి ఆఔఅలు, డివిజన్ ఇన్చార్జ్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీనివాస్, బూత్ లెవల్ ఏజెంట్స్ ట్రైనర్ పి. రాజశేఖరరెడ్డి, జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, మున్సిపాలిటీ ఛైర్మన్ తాటికొండ వినయ్కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, అలాగే జనగామ, హనుమకొండ జిల్లాల కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, ఏడు మండలాల పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మరియు జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, పీఏసీఎస్ ఛైర్మన్లు, దేవస్థాన కమిటీ ఛైర్మన్లు, బూత్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను బీఎలోలు వేగవంతంగా పూర్తి చేయాలి

- గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి
- కలెక్టరేట్లో వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన నూతన బీఎల్ఓలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై దిశా నిర్దేశం

హనుమకొండ, జూన్ 06(మనం ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బి ఎల్ వోలు మరింత వేగవంతంగా పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్గ్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇన్చార్జి కమిషనర్, చాహత్ బాజ్ పాయి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నూతన బిఎల్వోలతో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఇన్చార్జి కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇన్చార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయి ఎన్నికల ప్రక్రియలో బూత్ లెవల్ అధికారుల (బీఎల్వో) పాత్ర అత్యంత కీలకమని పేర్కొంటూ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో మెరుగైన పురోగతి ఉండాలని బిఎల్వోలకు సూచించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు, ఇంటింటి ధృవీకరణ ప్రక్రియ, అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో నమోదు చేయడం, మరణించిన లేదా శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను పరిశీలించడం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటరు జాబితాల నవీకరణ చేపట్టాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులను పాటిస్తూ, ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో నాయబ్ తహసిల్దార్ ఎండి సుభాన్, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

## సర్ సర్వేను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద



హనుమకొండ, జూన్ 06( మనం ప్రతినిధి ): వరంగల్ జిల్లాలో జరుగుతున్న సర్ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి చేరుకొని అర్హుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఈ ఎస్ ఐ ఆర్ పరిశీలనలో జెడ్పిసిఈఓ రామ్ రెడ్డి, దుగ్గొండి ఎమ్మార్వో సమ్మక్క , బి ఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత పోలీసుల ప్రధాన లక్ష్యం

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



హనుమకొండ జూన్ 06( మనం ప్రతినిధి): మహిళ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు పనిచేస్తారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా రెవిన్యూ మరియు పోలీసుల ఆధ్వర్యంలో శనివారం ధర్మసాగర్ మండలం పెండ్యాల గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో గ్రామస్తులను ఉదేశ్యస్తూ వరంగల్ సీపీ ముందుగా మహిళ భద్రత గురించి మాట్లాడుతూ ప్రతి మహిళ ఆత్మస్థైర్యంతో ముందుకు సాగిపోవాలని, ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనిఅన్నారు . మహిళలు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగి పోవాలని, మహిళలు తాము అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే ఆత్మ విశ్వాసం అవసరమని పేర్కొన్నారు. , మహిళల భద్రతకై షీ టీం విభాగం పనిచేస్తుందని. ఎవరైనా వేధింపులకు పాల్పడితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మహిళలు తమ. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, కోరారు. పిల్లల అభివృద్ధి లో మహిళల పాత్ర కీలకమని సీపీ చెప్పారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు బాధ్యాయుతంగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించగలమని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రావు, స్థానిక సర్పంచ్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోదామును తనిఖీచేసిన జిల్లా కలెక్టర్



హనుమకొండ, జూన్ 06(మనం ప్రతినిధి): హనుమకొండ సుబేదారిలోని రెడ్క్రాస్ భవనం వెనుక ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, రావు అమరేందర్ రెడ్డి, కుసుమ శ్యాంసుందర్, నాగబెల్లి రజనీకాంత్, సయ్యద్ ఫైజుల్లా, మణి, లక్ష్మణ్, ఎం.డి. నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కార్యక్రమంలో 10శాతం లక్ష్యాన్ని మించి నమోదు పెంచాలి

- ఎఐ ఆధారిత విద్య, సమ్మిళిత విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




వరంగల్, జూన్ 6(మనంన్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు నిర్వహిస్తున్న 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం - 2026-27' పై జిల్లా కలెక్టర్ డా. సత్య శారద రు శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పాఠశాలల, డిగ్రీ కాలేజీలలో ఇంటర్మీడియట్ కాలేజీలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు దశ నిర్దేశం చేసేందుకు విద్యా శాఖ అధికారులు ,ఇంటర్మీడియట్ ,డిగ్రీ కాలేజీల ప్రిన్సిపల్స్ లతో సమీక్ష సమావేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం లక్ష్యాన్ని మించి నమోదు పెంపు లక్ష్యాన్ని సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పాఠశాల స్థాయిలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, ఇంటింటి ప్రచారం, తల్లిదండ్రులతో సమావేశాలు, పాఠశాలల ప్రత్యేకతల ప్రచారం వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కృత్రిమ మేధస్సు (అఐ) ఆధారంగా నిర్దేశించిన ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక దృష్టి సారించి నమోదు పెంపుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు కోసం Khan Academy, Physics Wallah వంటి డిజిటల్ విద్యా వనరులను సమర్థవంతంగా వినియోగించి, ప్రతి విద్యార్థికి వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని సూచించారు. అలాగే సమ్మిళిత విద్య కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భవిత కేంద్రాలను బలోపేతం చేసి, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల (ఇఠీఖ) నమోదును పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అటువంటి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలు, విద్యా సహాయాలు, Aids Appliances సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న ఫిజియోథెరపీ సేవలు, ప్రత్యేక శిక్షణ, పునరావాస సేవల గురించి ప్రజలకు, తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సేవలను మరింత మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంపులో వినూత్న పద్ధతులు అవలంబించి, విశేష ఫలితాలు సాధించిన కొందరు విద్యాధికారులకు ప్రభుత్వం విదేశీ పర్యటన అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. బడిబాట కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ కలిసి బడిబాట కార్యక్రమం లో కలిసి నిర్వహించాలని, ప్రభుత్వం పాఠశాలల్లో ఉత్తీర్ణత పొందిన ప్రతి విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో అడ్మిషన్స్ తీసుకునేలా తల్లిదండ్రులకు పిల్లలకు అవేర్నెస్ కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.అదే విధంగా జూనియర్ కాలేజీ లలో ఉత్తీర్ణత పొందిన స్టూడెంట్స్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో అడ్మిషన్ తీసుకునేలా అవేర్నెస్ తీసుకురావాలని అన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రైవేట్ కాలేజీల కు ధీటు గా మౌలిక సదుపాయాలతో పాటు టాయిలెట్స్ విద్యార్థులకు సరిపడినన్ని టాయిలెట్స్ ఉండేలా చూడాలని,వారు పేర్కొన్నారు.శానిటరి సోక్ ఫిట్ ఏర్పాట్లు చేయాలని, నాలుగు రకాల బీన్స్ ఏర్పాటు చేసి పిల్లలకు రానున్న వర్ష కాలంలోఫ్రైడే డ్రై డే ను నిర్వహించాలి, కమ్యూనికేబుక్ డెసిజెస్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) వై.వి. గణేష్, ఐఏఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏఎంఓ సుజన్ తేజ, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి డా. కె. శ్రీనివాస్, డీఐఈఓ శ్రీధర్ సుమన్, డిగ్రీ కళాశాలల నోడల్ అధికారి డా. నవీన్, మండల విద్యాధికారులు (MEOЁ$), స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల ఆయాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమదేవరపల్లి జూన్ 6 మనం న్యూస్: భీమదేవరపల్లి మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో పోస్టులకు ఇంచార్జ్ ఎంఈఓ సునీత రాణి దరఖాస్తు ఆహ్వానించారు. శనివారం రోజున మండల ప్రజా పరిషత్ పరిధిలోని గంగిరెద్దుల కాలనీ, భీమదేవరపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయా ,ఇన్స్ట్రక్టర్ల పోస్టుల భర్తీకి ఆయా గ్రామాల అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు జూన్ 8 వరకు ఆయా పాఠశాలల్లో సమర్పించాలని ఎంఈఓ ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను జూన్ 9న మండల విద్యాశాఖ కార్యాలయానికి సమర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.



# రైతులు అంతర్ పంటలు, పంట మార్పిడిపై దష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి
- అధిక రసాయన ఎరువులు వాడొద్దు.. క్యాన్సర్ ముప్పును కొనితెచ్చుకోవద్దు
- ఆడపిల్లల విద్యను ప్రోత్సహించి సమాజాభివద్ధికి తోడ్పడాలి

దుగ్గొండి. జూన్ 06 (మనం న్యూస్): ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపైనా దష్టి సారించాలని సూచించారు. అవసరమైన పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన వరి వంగడాలను సాగు చేయాలని తెలిపారు. రైతులు కందులు, బంతిపూలు, కూరగాయలు వంటి అంతర్ పంటలను




ప్రోత్సహించాలని, పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సూచించారు. దీంతో రైతులకు అదనపు ఆదాయం లభించడమే కాకుండా, బంతిపూల వంటి పంటల ద్వారా క్రిమికీటకాల ప్రభావాన్ని కూడా తగ్గించుకోవచ్చని చెప్పారు. అధిక రసాయనాలు కలిగిన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలని, వాటి వల్ల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు ఎక్కువగా అవలంబించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న కలెక్టర్, తడి చెత్త, పొడి చెత్త, బయో వేస్ట్, సానిటరీ వేస్ట్ను వేర్వేరుగా సేకరించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు నిరోధించాలని పిలుపునిచ్చారు. ఎండల తీవ్రతను దష్టిలో ఉంచుకొని ప్రజలు ఎలక్ట్రోల్ వాటర్ వంటి ద్రవాలను తీసుకోవడం అలవాటు చేసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించి వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారి చదువుకు కుటుంబాలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. మహిళా సాధికారత, విద్యాభివద్ధి ద్వారానే సమాజం పురోగమిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెడ్పి సీఈఓ రామ్ రెడ్డి, దుగ్గొండి తహసిల్దార్ సమ్మక్క, గ్రామ ప్రజలు సంబంధిత శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థుల అనేక సమస్యలకు ఆటలే పరిష్కారం

- ఫోన్‌లు వదిలి ఆట మైదానాలకు అలవాటు పడండి
- సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి శ్రీహరి సూచనలు
- సర్టిఫికేట్లు, బహుమతులు పురస్కరించిన వాకిటి




**హైదరాబాద్, జూన్ 6 :** 'ఓటమి గెలుపునకు తొలిమెట్టు' అని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి లో దాదాపు నెల పైగా సాగిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలకు మంత్రి ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 24 నుండి జూన్ 7 వరకు జరిగిన ఈ సమ్మర్ క్యాంపు లో 600 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. చిన్న చిన్న సమస్యలకు విద్యార్థులు మానసికంగా కుంగి పోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్రీడలు మాత్రమే మానసిక, శారీరక ధ్రుడత్వాన్ని కలగ జేస్తాయని తెలిపారు. ఓటమికి కుంగిపోకుండా మళ్ళీ ఎలా విజయం సాధించాలనే కసి విద్యార్థులకు పెరగాలన్నారు. విద్యార్థులు ఫోన్ లకు అలవాటు పడకుండా మైదానాలకు అలవాటు పడాలని హితబోధ చేశారు. మత్తు వదలి మైదానాలు చేరాలనే నినాదం తో ఈ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తుందని తెలియజేశారు.

ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ఉన్న అన్ని మెదానాలను అభివృద్ధి చేసి మంచి నైపుణ్యం ఉన్న కోచ్ లను నియమించనున్నట్లు మంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం ఈసారి క్రీడలకు బడ్జెట్ లో అధిక నిధులు కేటాయించిందని స్పష్టం చేశారు. సీఎం కప్ సెకండ్ ఎడిషన్ లో భాగంగా దాదాపు 3 లక్షల మంది పిల్లలు గ్రామీణ,మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలు ఆడారని మంత్రి పేర్కొన్నారు .

ఇప్పుడు 3వ ఎడిషన్ లో 5 లక్షల క్రీడాకారులను పాల్గొనేలా చేయడమే ధ్యేయం గా పెట్టుకున్నామని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపు లో శిక్షణ పొందిన విద్యార్థులకు మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, ఎంవీర్ గ్రూప్ చైర్మన్ వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజ్ఞానందకు మోదీ అభినందనలు

ప్రతిష్ఠాత్మక నార్వే చెస్ టోర్నీ టైటిల్ను గెలిచిన తొలి భారత ప్లేయర్ గా 20 ఏళ్ల ప్రజ్ఞానంద ఘనత సాధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. అతడి ప్రతిభకు ఇదో కీలక మైలురాయి అంటూ ప్రశంసించారు. ప్రజ్ఞానంద భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సైతం యువ గ్రాండ్ మాస్టర్ ను అభినందించారు. ఈ అద్భుతమైన విజయం అతని అసాధారణ ప్రతిభకు, అచంచలమైన అంకితభావానికి, ఏళ్ల తరబడి చేసిన కృషికి నిదర్శనమన్నారు. ప్రపంచ వేదికపై అత్యుత్తమమైన ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేశాడని ప్రశంసించారు. ప్రజ్ఞానంద విజయం దేశంలోని ఎందరో యువ చెస్ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందన్నారు.

నార్వే చెస్ టోర్నీ టైటిల్ విజేతగా నిలిచిన తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద ఘనతకెక్కాడు. 20 ఏళ్ల యువ గ్రాండ్ మాస్టర్ కు ఇది రెండో నార్వే చెస్ టోర్నీ మాత్రమే. ఏడుసార్లు నార్వే చెస్ టోర్నీ విజేతగా నిలిచిన ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్ సన్ ను ఈ టోర్నీలో ప్రజ్ఞానంద రెండుసార్లు ఓడించాడు. తొలి ఆరు రౌండ్లలో మూడింట్లో ఓటమిపాలైనప్పటికీ అద్భుతంగా పుంజుకున్న ప్రజ్ఞానంద.. వరుసగా నాలుగు విజయాలు సాధించాడు. ఇక చివరి రౌండ్ లో మరో భారత స్టార్ గుకేశ్ ఓటమిపాలయ్యాడు. అతడిపై మాగ్నస్ కార్ల్సన్ విజయం సాధించాడు. గుకేశ్ 8 పాయింట్లతో చివరి స్థానానికి పరిమితమయ్యాడు.

# రామ్ క్రేజీ థ్రిల్లర్ కోసం 'క్రిష్ 3' సినిమాటోగ్రాఫర్!

మన టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని హీరోగా అలానే తన దర్శకత్వంలో మొదటి సినిమాగా తన కెరీర్ 23వ సినిమాగా చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక క్రేజీ థ్రిల్లర్ గా రామ్ పోతినేని తన సినిమాని షేప్ అవుట్ చేసుకోగా అభిమానులు ఓ రేంజ్ లో సినిమా కోసం ఎదురు చూస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి సాలిడ్ అప్డేట్ ని తాను అందించాడు. ఈ చిత్రానికి పలు పాపులర్ సినిమాలు క్రిష్ 3, ఆచార్య, గేమ్ ఛేంజర్ లాంటి భారీ సినిమాలకి కెమెరా వర్క్ అందించిన పాపులర్ సినిమాటోగ్రాఫర్ తిరు సాలిడ్ విజువల్స్ ని అందించనున్నారని సాలిడ్ అప్డేట్ ని ఇప్పుడు అందించాడు. దీనితో పాటుగా తనతో వర్క్ విషయంలో రామ్ పోతినేని తన ఎగ్జైట్మెంట్ ని తెలిపాడు. సో ఈ సినిమాకి తన వర్క్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇక ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి ఇతర వివరాలు ముమ్ముందు రానున్నాయి. అలాగే ఈ సినిమాని రామ్ పోతినేని సోదరుడు కృష్ణ పోతినేని నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.

# సమాజంలో జరిగే విషయాలకు సినిమాలను నిందించొద్దు



సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందన్నారు నటి అనసూయ. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు.

''ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను'' అని అనసూయ చెప్పారు.

''సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే'' అని అనసూయ వివరించారు. తాను ఎవరినీ నిందించడం లేదని, ఈ వ్యవస్థలో మనమంతా భాగమేనని గుర్తుచేయడమే తన ముఖ్య ఉద్దేశమని అనసూయ స్పష్టంచేశారు. ఇకనైనా క్రియేటర్స్, నటీనటులు, దర్శకనిర్మాతలు, ఇన్ఫ్లుయెన్సర్లు, ఆడియన్స్ మరింత సామాజిక స్పృహతో, బాధ్యతాయుతంగా కంటెంట్ ను క్రియేట్ చేస్తారని తాను ఆశిస్తున్నట్లు తెలిపారు.

# సింగ్ గీతం చేయడం నా అదృష్టం



''సింగీతం శ్రీనివాసరావుగారు చేసినన్ని ప్రయోగాలు ఎవ్వరూ చేసి ఉండరు. 'సింగ్ గీతం' ప్రాజెక్ట్ చేస్తున్నామని మూడేళ్ల క్రితం ఆయన చెప్పినప్పుడు హ్యాపీ అనిపించింది. నాగ్ అశ్విన్ గారు, స్వప్నగారు, వైజయంతి మూవీస్ తో కలిసి ఈ సినిమా రూపొందడం మరింత ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను'' అని దేవిశ్రీ ప్రసాద్ తెలిపారు.

ఆయాన్, అహల్యా బమ్రూ జంటగా శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషించిన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వంలో వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ పై నాగ్ అశ్విన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

- నేను సింగీతంగారికి వీరాభిమానిని. మా నాన్న సత్యమూర్తిగారిని కలవడానికి వచ్చినప్పుడు వాళ్లు మాట్లాడుకుంటుంటే నేను ఆరాధనగా చూసేవాడిని. అలాంటిది సింగీతంగారితో కలిసి పని చేయడం ఒక ఆశీర్వాదంగా అనిపించింది. సింగీతంగారు ఎప్పుడూ ట్రెండ్ కి తగ్గట్టు కథలు ఆలోచించలేదు. ఆయనకు ఒక ఆలోచన వచ్చిందంటే అది ఇంతకు ముందు రానిది, తర్వాత కూడా రానిదిగా ఉంటుంది. 'పుష్పక విమానం' ఇప్పటికీ చాలా అడ్వానడ్స్ మూవీ. 'సింగ్ గీతం' ఐడియా కూడా అంతే కొత్తగా ఉంటుంది.
- ఒక గ్రామం మొత్తం మాట్లాడలేక కేవలం పాటల రూపంలోనే సంభాషించే కథ ఇప్పటివరకు రాలేదు. అది 'సింగ్ గీతం'లో కొత్తగా ఉంటుంది. నా కెరీర్ లో సవాల్ తో కూడుకున్న సినిమా ఇది. ఇది కేవలం కామెడీ సినిమా కాదు... అద్భుతమైన భావోద్వేగాలు కూడా ఉన్నాయి. కమల్ హాసన్ గారు సినిమా చూసి, 'ఇలాంటి సినిమాలో నేను కూడా భాగం కావాల్సింది' అనడం మాకు ఆనందాన్నిచ్చింది.
- చిన్నప్పటి నుంచి ప్రతి అక్షరాన్ని సంగీతంగా మార్చే అలవాటు నాకుండేది. అప్పుడు న్యూస్ పేపర్ తీసుకుని అందులో ఉన్న వార్తలనే ట్యూన్స్ గా మార్చుకునేవాడిని. అది 'సింగ్ గీతం'కి ఉపయోగపడింది. ఈ సినిమా కోసం ప్రతిదీ ముందుగానే మ్యూజికల్ గా చేసి ఇచ్చాం. తర్వాత షూట్ చేశారు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ పాడగలిగారు. 94 ఏళ్ల వయసులోనూ కొత్త ఆలోచనతో, ఉత్సాహంగా సినిమా చేసిన సింగీతంగారి నుంచి ప్రేక్షకులు స్ఫూర్తి పొందుతారు.

# క్షమించండి..

## ఆ సీన్లలో మార్పులు చేస్తాం




పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్రపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. మహిళలను అవమానించేలా జాన్వీ కపూర్ పాత్రను తీర్చిదిద్దారంటూ పలువురు నెటిజన్స్ బుచ్చిబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సినిమాలో హీరోయిన్ ని చూపించిన తీరు, కొన్ని సన్నివేశాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుచ్చిబాబు తాజాగా ఈ విమర్శలపై స్పందించాడు. క్షమాపణలు కోరుతూ సోషల్ మీడియాలో ఓ సుధీర్ఘమైన పోస్ట్ పెట్టాడు.

ఒక ఫిల్మ్ మేకర్ గా.. సినిమా అనేది ప్రేక్షకులను అలరించాలి, వారిలో స్ఫూర్తిని నింపాలి అనుకుంటాను. ఎవరినీ అసౌకర్యానికి, అగౌరపరచాలని చూడను. పెద్దిలో కొన్ని సన్నివేశాలు ఇబ్బందిగా అనిపించినట్లు మా దృష్టికి వచ్చింది. వాటిని తీవ్రంగా పరిగణించాం. తెరపైన, తెర వెనుక కూడా మహిళలంటే నాకు ఎప్పుడూ అపారమైన గౌరవం ఉంది. మహిళల పాత్రలను అగౌరవపరచడం నా ఉద్దేశం కాదు. ఈ సినిమాలో సన్నివేశాలు మీ మనోభావాలు దెబ్బతీసేలా ఉంటే.. మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నాను. అలాగే ఆయా సన్నివేశాలలో మార్పులు చేయాలని నిర్ణయం తీసుకున్నాం (జాన్వీ కపూర్ కి సంబంధించిన రొమాంటిక్ సీన్లన్నీ తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం).

ప్రేక్షకులు ఆదరిస్తేనే సినిమా ఎదుగుతుంది. అభిమానులతో ఉన్న అనుబంధమే సినిమా రంగాన్ని ముందుకు తీసుకెళ్తుంది. అలాంటి అభిమానుల భావోద్వేగాలు, అంచనాలను దృష్టిలో పెట్టుకుని కథలు రాసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది. కొన్ని సున్నితమైన అంశాలపై కచ్చితంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రతి మహిళా గౌరవానికి అర్హురాలే. వారిని శక్తిమంతంగా చూపించడానికి, వారి విలువను పెంచే కథలు చెప్పడానికి మేం కట్టుబడి ఉన్నాం. తమ అభిప్రాయాలను నిజాయితీగా, మనస్ఫూర్తిగా పంచుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని బుచ్చిబాబు తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చాడు.

# 'ఓజి 2' పై లేటెస్ట్ ఇంట్రెస్టింగ్ బజ్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్ లో సెన్సేషన్ గా నిలిచిన రీసెంట్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది 'ఓజి' అనే చెప్పాలి. తన ఫ్యాన్ దర్శకుడు సుజీత్ తో చేసిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ మిక్స్డ్ టాక్ తో కూడా 300 కోట్లకి పైగా వసూళ్లు రాబట్టింది. అయితే ఈ సినిమాకి సీక్వెల్ ని కూడా మేకర్స్ అనౌన్స్ చేయడం తర్వాత పవన్ నుంచి కూడా ముందే గ్రీన్ సిగ్నల్ రావడంతో ఓజి 2 పై అంచనాలు ఇప్పుడు పీక్స్ లో ఉన్నాయి. ఇక దీని తర్వాత సుజీత్ నాచురల్ స్టార్ నానితో సినిమా స్టార్ట్ చేయాల్సి ఉంది కానీ అది ఇంకా మొదలు కాలేదు. కానీ ఈ గ్యాప్ లో సుజీత్ ఓజి 2 లో కూడా బిజీగా ఉన్నాడట. ఆల్రెడీ నాని సినిమాకి అంతా సెట్ చేసుకొని సిద్ధంగా ఉన్నాడు. కానీ ఈ గ్యాప్ లో ఓజి స్క్రిప్ట్ ని తాను లాక్ చేసేసినట్టు తెలుస్తుంది. ఓజి 2 స్క్రిప్ట్ లాక్ చేయడమే కాకుండా వీలు చూసుకొని పవన్ కి కథ నరేషన్ కూడా ఇవ్వనున్నట్టుగా టాక్. సో ఈ క్రేజీ బజ్ పవన్ ఫ్యాన్స్ కి నూతన ఉత్సాహాన్ని తీసుకొస్తుంది అని చెప్పవచ్చు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.